


VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారం

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 190 విశాఖపట్నం, 10 మే 2025 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00



## నేటి నుంచి హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు

- గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభ కార్యక్రమం
- పోటీలకు భారీగా పోలీసు బందోబస్తు
- అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసిన తెలంగాణ ప్రభుత్వం
- ఇప్పటికే నగరానికి చేరుకున్న 110 మంది అందగత్తెలు
- మరో వైపు మిస్ వరల్డ్ పోటీలపై యుద్ధం నీడలు

- వివరాలు 8లో



# రంగంలోకి టెరిటోరియల్ ఆర్మీ

- ఆర్మీ చీఫ్‌కు కేంద్రం అధికారాలు

**పాకిస్థాన్ దుర్మార్గపు దాడులను ఎదుర్కొనేందుకు భారత్ పూర్తి స్థాయిలో సిద్ధమైంది. భారత సైన్యం ఇప్పటికే పాక్ ఎత్తులను చిత్తు చేస్తోంది. ఇప్పుడు వారికి మద్దతుగా టెరిటోరియల్ ఆర్మీని రంగంలోకి దించేందుకు కేంద్రం సమాయత్తమైంది.**



**దిల్లీ, విశాఖ సమాచారం:** పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో భారత ఆర్మీ చీఫ్‌కు కేంద్రం మరిన్ని అధికారాలను అప్పగించింది. డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడులు చేసిన పాక్‌ను భారత్ సమర్థంగా అడ్డుకొంది. ఆ రెండూ విఫలం కావడంతో పాక్ మరో కుతంత్రానికి తెరదీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. సరి హద్దు ప్రాంతాల్లో దాడులు చేసి భారత్‌ను ఇబ్బంది పెట్టాలనేదే పాక్ పన్నాగం. దీంతో ఆ దేశానికి అలాంటి అవకాశం ఇవ్వకుండా భారత ఆర్మీని మరింత దృఢంగా తయారు చేసేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భారత ఆర్మీ చీఫ్‌కు మరిన్ని అధికారాలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అవసరమైతే టెరిటోరియల్ ఆర్మీని రంగంలోకి దించాలని స్పష్టం చేసింది. ఇందులోని అధికారులను, నమోదు చేసుకున్న సిబ్బందిని పిలిచేందుకు అధికారం కల్పించింది. రెగ్యులర్ ఆర్మీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్రం సూచించింది. ధోనీ, మోహన్‌లాల్ లెఫ్టినెంట్ కర్నల్ అధికారులే ఇప్పటి వరకు పలు సందర్భాల్లో టెరిటోరియల్ ఆర్మీ సిబ్బంది యుద్ధాల్లో పాల్గొంది. 1962, 1965, 1971 యుద్ధాల్లో భారత సైన్యంతో ...(మిగతా 2లో)



# ఇంటా.. బయటా దాడులతో పాక్ బెంబేలు

**దిల్లీ:** పాకిస్థాన్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఒక్క పక్క భారత ఆర్మీదాడులతో పాక్ బెంబేలెత్తి పోతుండగా.. మరో పక్క బీఎల్ఏ దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. తెహ్రిక్ఇ–తాలిబన్ దాడుల్లో 20 మంది పాక్ సైనికులు హతమయ్యారు. ఇదిలా ఉండగా, పాక్ ప్రధానిని ఆ దేశ ఎంపీలు టార్గెట్ చేశారు. పాక్ పార్లమెంట్ సాక్షిగా ప్రధాని షెహబాజ్‌పై విమర్శలు గుప్పించారు. షెహబాజ్ పిరికిపంద అంటూ పాక్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారత సైన్యం దాడులతో ...(మిగతా 2లో)

## దేశంలో నిత్యావసర వస్తువుల కొరత లేదు

### ఆందోళన వద్దు.. కేంద్రం భరోసా



**దిల్లీ:** దేశంలో కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల కొరత లేదని.. తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని కేంద్రం ప్రజలకు హామీ ఇచ్చింది. భారత్–పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ ప్రజల భద్రత కోసం ...(మిగతా 2లో)

## IPL 2025 నిరవధిక వాయిదా

### భారత్ - పాక్ ఉద్రిక్తతల ఎఫెక్ట్



**దిల్లీ:** ఐపీఎల్ నిర్వహణపై బీసీసీఐ స్పష్టత ఇచ్చింది. ఓ వైపు యుద్ధం జరుగుతున్న వేళ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం సరైంది కాదంటూ ఐపీఎల్‌ను నిరవధికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్ 2025) 18వ సీజన్ నిరవధికంగా వాయిదా పడినట్లు సమాచారం. భారత్ – పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుందని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారుతోంది. అయితే, ఆటగాళ్ల భద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతో వాయిదా వేసినట్లు బీసీసీఐ అధికారులు శుక్రవారం పేర్కొన్నారు. “ఓవైపు దేశం యుద్ధం చేస్తుంటే.. ఇలాంటి సమయంలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం సరైంది కాదనిపించింది” అని వెల్లడించారు. ఇప్పటికే పంజాబ్, దిల్లీ మ్యాచ్ భద్రతా కారణాలరీత్యా మధ్యలోనే రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఇవాళ లఖ్‌నవూ – ఆర్సీబీ ...(మిగతా 2లో)

## పేదరికం వల్ల చదువుకోలేని పరిస్థితి రాకూడదు : సీఎం చంద్రబాబు



**అనంతపురం, విశాఖ సమాచారం:** పేదరికం వల్ల ఎవరికీ చదువుకోలేని పరిస్థితి రాకూడదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అండదండలు లేక ఎంతో మంది యువత కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో హంద్రీనీవా పనులను పరిశీలించిన సీఎం.. అక్కడ జరుగుతున్న పనుల తీరును గమనించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. “సమాజాన్ని ఆసరా చేసుకొని బాగుపడిన వారు ఆలోచించాలి. ఇంకా ఎంతోమంది పేదరికంలో ఉన్నారు. పేదవాళ్లను పైకి తీసుకొచ్చేందుకు తమ పరిధిలో చేయూత ఇవ్వాలి. కింద స్థాయిలో ఉన్న 20శాతం మందికి అండగా నిలుద్దాం. సూచనలు, సలహాలే కాదు.. అవసరమైతే కాస్త డబ్బు ఖర్చు చేద్దాం. ఆర్థిక అసమానతలు తగ్గించడమే మా ప్రభుత్వ లక్ష్యం” అని అన్నారు. “పేదవాడు ఆకలితో ఉంటే సమాజానికి మంచిది కాదు. వారి జీవితాల్లో వెలుగులు తెచ్చేవరకు మీతోనే ఉంటా. కష్టపడి చదువుకుని పైకి వచ్చినవారు ఎంతోమంది ఉన్నారు. సరైన సమయంలో సరైన గైడెన్స్ ఉంటేనే జీవితంలో పైకి రాగలం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అనేక సేవలు అందుబాటులోకి తెచ్చాం. పనుల కోసం మీరు ప్రభుత్వ ...(మిగతా 2లో)

## ఆంధ్రా టు అబుదాబి..

### ఏపీ నుంచి కొత్త విమాన సర్వీసులు



**డిల్లీ:** ఏపీ నుంచి బెంగళూరు, భువనేశ్వర్, అబుదాబికి విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం ప్రకటించారు. విమానయాన సర్వీసుల విస్తరణతో రాష్ట్రమంతటా కనెక్టివిటీని పెంచేందుకు ...(మిగతా 2లో)




## విశాఖలో వాటర్ స్పోర్ట్స్‌కు పూర్వవైభవం

### శాప్ ఛైర్మన్ రవినాయుడు

**విశాఖపట్టణం, విశాఖ సమాచారం:** గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విశాఖ రుషికొండ ప్రాంతంలో నిర్వీర్యమైన వాటర్ స్పోర్ట్స్ కు పూర్వవైభవం చేకూరుస్తున్నామని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయడు పేర్కొన్నారు. రుషికొండలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కెనాయింగ్ అండ్ కయాకింగ్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన వాటర్ స్పోర్ట్స్ సమ్మర్ కోచింగ్ క్యాంపును శుక్రవారం ఆయన ప్రారంభించారు. తొలుత వాటర్ స్పోర్ట్స్ నిర్వహిస్తున్న డీఎస్ఏ ల్యాండ్ పరిశీలన అనంతరం కయాకింగ్ క్రీడాకారులతో కలిసి బోట్ రేసింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులతో మాట్లాడుతూ విశాఖ వేదికగా వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధి చేయాలని 2002లోనే అప్పటి సీఎం చంద్రబాబు ...(మిగతా 2లో)



## భారత్-పాక్ యుద్ధంలో జోక్యం చేసుకోం


- అమెరికా ఉపాధ్యక్షుడు
- జేడీ వాన్స్ స్పష్టీకరణ

**వాషింగ్టన్:** భారత్–పాక్ మధ్య జరుగుతున్న సైనిక ఘర్షణలో తాము జోక్యం చేసుకోబోమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తేల్చిచెప్పారు. ఫాక్స్ న్యూస్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. “రెండు అణుశక్తి దేశాలు ఘర్షణ పడుతూ భారీ సంక్షోభం వైపు రావడంపై మేము ఆందోళన చెందుతున్నాం. వీలైనంత తొందరగా పరిస్థితులు శాంతించాలని కోరుకుంటున్నాం. పాకిస్థాన్‌పై భారత్‌కు కొన్ని ఫిర్యాదులున్నాయి. న్యూదిల్లీ చర్యలకు పాక్ స్పందిస్తోంది. పరిస్థితులు తగ్గుముఖం పట్టేలా చేయాలని మేము వీరిని ప్రోత్సహించగలం. కానీ, యుద్ధంలో మాత్రం తలదూర్చం. అది మా పని కాదు. అమెరికాతో దానికి ఏమాత్రం ...(మిగతా 2లో)



## తిరుమల ఆలయంపై మళ్లీ విమానాల చక్కర్లు

**తిరుమల, విశాఖ సమాచారం:** తిరుమల శ్రీవారి ఆలయం మీదుగా మరోసారి విమానాలు వెళ్లడం కలకలం రేపింది. శుక్రవారం ఉదయం శ్రీవారి ఆలయం మీదుగా మూడు విమానాలు వెళ్లాయి. ఆనంద నిలయం మీదుగా విమానాల సంచారం తిరుమల ఆగమ శాస్త్ర నిబంధనలకు విరుద్ధం. అయినా తరుచుగా విమానాలు, డ్రోన్లు కొండపై కనిపిస్తున్నాయి. ఇండియా పాక్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో విమానాలు తిరుమల శ్రీవారి ఆలయం మీదుగా తిరగడంపై టీటీడీ భద్రతా అధికారులు ఆరా తీస్తున్నారు. గురువారం ఉదయం కూడా ఓ విమానం స్వామివారి ఆలయం మీదుగా చక్కర్లు కొట్టింది. ఇప్పటికే తిరుమల ఉగ్రవాదుల హిట్‌లిస్ట్ లో ఉందన్న వార్తల నేపథ్యంలో తరచూ



విమానాలు తిరగడం అటు అపచారంతో పాటు ఇటు భక్తుల ఆందోళనకూ కారణమవుతోంది. ...(మిగతా 2లో)

2nd pages11.qxd 5/9/2025 8:01 PM Page 2



## కళ్లముందు ఆటలాడిన కవలలు కాసేపటికే శవాలై.. పాక్ కవ్వింపులతో విషాదం



**ఇంటర్నెట్‌డెస్క్:** భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతోన్న తరుణంలో సరిహద్దులో దాయాది రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోంది. దీంతో పలువురు సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. చిన్నపిల్లలు మృతి చెందడంపై జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మోహబూబా ముఫ్తీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉద్వేగానికి గురయ్యారు. "కళ్లముందే ఆటలాడిన కవలలు అంతలోనే రక్తపుమడుగులో కనిపించారు. ఇలా ఎదురుకాల్పుల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయిన చిన్నారులు, మహిళలు చేసిన తప్పేంటి..? ఇది ఎక్కడివరకు వెళ్తుంది. జమ్మూకశ్మీర్ ప్రజలు మరీ ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల వారు ఇంకా ఎంతకాలం బాధపడాలి..? తల్లులకు ఎంతకాలం ఈ కడుపుకోత..?" అని ప్రశ్నించారు. అలా మాట్లాడుతూ ఆమె కంటతడిపెట్టారు.

ఆపరేషన్ సిందూర్ తో దిక్కుతోచని పాకిస్థాన్.. సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. కుప్వారా, బారాముల్లా, ఉరీ, పూంఛ్, మెంథార్, రాజౌరీ సెక్టార్లలో మోర్టార్లు, శక్తిమంతమైన శతఘ్నులతో కాల్పులకు తెగబడింది. దీంతో బుధ, గురువారాల్లో 16 మంది మరణించారు. ఇందులో ఐదుగురు చిన్నారులు, ముగ్గురు మహిళలున్నారు. పూంఛ్ సెక్టార్‌లో చనిపోయిన వారిలో లాన్స్‌నాయక్ దినేశ్ కుమార్ (32) ఉన్నారు. ఆయన హరియాణాకు చెందినవారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత పూంఛ్, రాజౌరీ, జమ్ములో మరోసారి పాక్ కాల్పులు, షెల్లింగ్ జరిపింది. క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లు, యుద్ధ విమానాలను మన దేశంపైకి ప్రయోగించింది. సరిహద్దు రాష్ట్రాలైన జమ్మూ కశ్మీర్, రాజస్థాన్, పంజాబ్‌లపైకి వాటిని వదిలింది. వాటన్నింటిని మన సైన్యం చిత్తు చేసింది.

## దేశంలో నిత్యావసర వస్తువుల కొరత లేదు

(మొదటి పేజీ తరువాయి)

భారత ప్రభుత్వం పలు కీలక చర్యలు తీసుకుంటోంది. ఎటువంటి పరిస్థితులు వచ్చినప్పటికీ.. దేశంలో కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల కొరత లేదని.. తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని హామీ ఇచ్చింది. పప్పుధాన్యాలు, కూరగాయలు వంటి కీలకమైన ఆహార పదార్థాల ధరలు నియంత్రణలో ఉండేలా నిశితంగా పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అన్ని నగరాల్లో ఈ వస్తువుల సరఫరాను స్థిరంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపాయి. ఈ విషయంలో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్ర ఆహార కార్యదర్శులు, ఇతర కీలక వాటాదారులతో సమావేశాలు నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. నిత్యావసరాల ధరలు పెంచడం, నిల్వలను దాచడం వంటివి నివారించడానికి వ్యాపారులు, సరఫరాదారులపై నిఘా ఉంచాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు.

### సరకుల నిల్వపై చండీగఢ్‌లో నిషేధం

భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న సమయంలో సరిహద్దు జిల్లాల పట్ల కేంద్రం మరింత శ్రద్ధ వహిస్తోంది. ఇందులో భాగంగా చండీగఢ్‌లో నిత్యావసర సరకుల నిల్వపై అధికారులు నిషేధం విధించారు. వ్యాపారులందరూ తమ వద్ద ఉన్న నిల్వల సమాచారాన్ని మూడు రోజుల్లోపు ఆహార, సరఫరాల శాఖకు తెలియజేయాలి ఆదేశాలు జారీ చేశారు. దేశంలో ఉద్రిక్తతలు నెలకొంటున్న సమయంలో ఇదే అదునుగా భావించి కొందరు వ్యాపారులు, సంస్థలు పెట్రోల్, డీజిల్ సహా ఇతర నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా పాక్ సరిహద్దు రాష్ట్రాలపై దాడులకు పాల్పడుతోంది. ఈ క్రమంలోనే పంజాబ్‌లోని చండీగఢ్‌లో శుక్రవారం ఉదయం నుంచి మరోసారి సైరన్ల మోత వినిపించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. పాక్ నుంచి దాడులు జరిగే అవకాశం ఉందంటూ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఈ హెచ్చరిక జారీ చేసింది. ప్రజలంతా ఇళ్లల్లోనే ఉండాలని హెచ్చరించింది. బాల్కనీల్లోకి కూడా రావొద్దని స్పష్టం చేసింది.

# మాది సహాయక పాత్ర మాత్రమే

## 'సింధు జలాల ఒప్పందం'పై ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు



**దిల్లీ:** భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమంటున్నాయి. దాయాదిని అన్ని వైపుల నుంచి దిగ్బంధిస్తోన్న కేంద్ర ప్రభుత్వం.. సింధుజలాల ఒప్పందం అమలును నిలిపి వేసింది. దీనిపై తాజాగా ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా స్పందించారు. "ఈ ఒప్పందం విషయంలో ప్రపంచబ్యాంక్ జోక్యం చేసుకొని సమస్యను ఎలా పరిష్కరిస్తుందనే దానిపై చాలా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అవన్నీ అర్థం లేనివి. ఈ బ్యాంక్ పాత్ర ఒక సహాయకుడిగా మాత్రమే ఉంటుంది" అని బంగా స్పష్టం చేశారు .ప్రస్తుతం బంగా భారత్‌లో పర్యటిస్తున్నారు. గురువారం ఆయన ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. శుక్రవారం ఉత్తర్ ప్రదేశ్‌తో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కలిశారు. అలాగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల సమయంలో ఆయన మనదేశంలో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ బ్యాంకు అధ్యక్ష పదవిని చేపట్టిన తొలి భారతీయ అమెరికన్‌గా, సిక్కు అమెరికన్‌గా బంగా చరిత్ర సృష్టించారు.

# ఏటీఎంల మూసివేత అవాస్తవం



**దిల్లీ:** భారత్-పాక్ ఉద్రిక్తతలు కొనసాగుతోన్న తరుణంలో సామాజిక మాధ్యమాల్లో నకిలీ వార్తలు ముంచెత్తుతున్నాయి. కొన్ని ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేలా ఉంటున్నాయి. ఈ యుద్ధ భయాల వేళ. ఏటీఎంలు మూసివేస్తున్నారంటూ వాట్సప్‌లో ఓ సందేశం చక్కర్లు కొడుతోంది. ర్యాన్సమ్‌వేర్ సైబర్ దాడి జరగొచ్చని, అందుకే రెండు నుంచి మూడు రోజులు ఏటీఎంలు మూసివేస్తారని దాని సారాంశం. దీనిపై పీఐబీ ఫ్యాక్ట్ చెక్ చేసింది. అది ఫేక్ వార్త అని స్పష్టం చేసింది. అవి ఎప్పటి లాగే పనిచేస్తాయని, ఇలాంటి అసత్య వార్తలను షేర్ చేయొద్దని సూచించింది. ఇంతకుముందు గుజరాత్‌లోని పోర్టు సహా, జలంధర్‌లో డ్రోన్, క్షిపణి దాడుల దృశ్యాలంటూ సోషల్ మీడియాలో పాక్ అనుకూల వ్యక్తులు వీడియోలు షేర్ చేసిన సంగతి తెలిసిందే. వీటిని భారత్ తిప్పికొట్టింది. పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ చేసి.. అవన్నీ అవాస్తవేమనని తేల్చింది. "గుజరాత్‌లోని హజీరా పోర్ట్‌పై దాడి జరిగిందంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో అవాస్తవం. ఆ వీడియో 2021 నాటి ఓ ఆయిల్ ట్యాంకర్ పేలుడుకు సంబంధించినదని ఫ్యాక్ట్‌చెక్‌లో తేలింది. ఇక, జలంధర్‌లో డ్రోన్ దాడి అంటూ వస్తోన్న దృశ్యాలు.. ఓ అగ్ని ప్రమాదానికి సంబంధించినవి" అని పీఐబీ వెల్లడించింది.

## భారత్-పాక్ యుద్ధంలో జోక్యం చేసుకోం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధం లేదు" అని వాన్స్ వెల్లడించారు. "భారత్, పాక్ ఆయుధాలు వదిలేయాలని అమెరికా చెప్పదు. కానీ, దీనికి ఉన్న ఏకైక మార్గం చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం. అది ప్రాంతీయ సంక్షోభానికి దారితీయకుండా చూసుకోవడం" అని వాన్స్ అన్నారు. గురువారం రాత్రి భారత్-పాక్ మధ్య ఘర్షణ పతాక స్థాయికి చేరింది. దీంతో పొరుగుదేశంలో నుంచి భారత్ పైకి వచ్చిన దాదాపు 50 డ్రోన్లను సైన్యం కూల్చివేసింది. మరోవైపు భారత్-పాక్ ఉద్రిక్తతలపై అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి టామీ బ్రూస్ స్పందించారు. "ప్రస్తుత ఉద్రిక్తలు మరింత పెరగకూడదన్నారు. ఇరుదేశాల మధ్య ఈ పరిస్థితి కొన్ని దశాబ్దాలుగా ఉంది. ఉగ్రదాడి తర్వాత మనం చూస్తున్నది ఆశ్చర్యమేమీ కాదు. కాకపోతే ఇవి మరింత పెరగకూడదు. చర్చలు జరగడానికి కమ్యూనికేషన్లు చాలా ముఖ్యం. అంతేకానీ, నిశ్శబ్ధంగా ఉండకూడదు. అమెరికా ఇప్పటికే గత రెండ్రోజుల నుంచి ఇరు దేశాల్లో వివిధ స్థాయి నాయకులతో మాట్లాడుతోంది. ఇక పాకిస్థాన్ పహల్గాం దాడిపై స్వతంత్ర దర్యాప్తును కోరుతోంది. మేము ఉగ్ర కుట్రదారులను చట్టం ఎదుటకు తెచ్చి శిక్షించాలని కోరుతున్నాం" అని బ్రూస్ వెల్లడించారు.

## తిరుమల ఆలయంపై మళ్లీ విమానాల చక్కర్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం భారత్ పాకిస్తాన్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, తిరుమలను నో ఫ్లైయింగ్ జోన్‌గా చెయ్యాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు.

### తిరుమలలో భద్రత కట్టుదిట్టం

తిరుమలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల దృష్ట్యా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు జిల్లా అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. తిరుమల సీవీఎస్‌వో కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. మధ్యాహ్నం నుంచి తిరుమలలో భద్రతా బలగాలు తనిఖీలు నిర్వహించాయి.

## విశాఖలో వాటర్ స్పోర్ట్స్‌కు పూర్వవైభవం

(మొదటి పేజీ తరువాయి)

నాయుడు భావించారని, తక్షణమే ఆచరణలో పెట్టడంతోపాటు 2019 వరకూ సమర్థవంతంగా వాటర్ స్పోర్ట్స్ నిర్వహించామన్నారు. కానీ గత ప్రభుత్వం హయాంలో వాటర్ స్పోర్ట్స్ నిర్వీర్యమైందన్నారు. డీఎస్ఏ పరిధిలోని వాటర్ స్పోర్ట్స్ నిర్వహణకు కేటాయించిన స్థలాన్ని సైతం కబ్జా చేసి ఆక్రమణలకు పాల్పడటం దారుణమన్నారు. కూటమి రాకతో వాటర్ స్పోర్ట్స్ కు పూర్వవైభవం చేకూరుస్తున్నామని, శాప్ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టాక వాటర్ స్పోర్ట్స్ సమస్యను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే రుషికొండలోని డీఎస్ఏ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో విశాఖలో వాటర్ స్పోర్ట్స్ ను అభివృద్ధి చేస్తున్నామని, అతి త్వరలోనే అత్యుత్తమ క్రీడావసతులు కల్పిస్తున్నామన్నారు. డీఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపును సద్వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా వాటర్ స్పోర్ట్స్ లో విశాఖ నుంచి అంతర్జాతీయ క్రీడాకారులు రాణించాలని సూచించారు. వాటర్ స్పోర్ట్స్ కేవలం క్రీడ మాత్రమే కాదని, ఆపత్కాలంలో ప్రాణాలను కాపాడే బాధ్యతాయుతమైన గొప్ప వరమన్నారు. అలాగే కెనాయింగ్ అండ్ కయాకింగ్ లో ఉన్న 11 క్రీడలను విశాఖలో నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. వాటర్ స్పోర్ట్స్ లో రాణించే క్రీడాకారులకు భద్రతా దళాల్లోనూ మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. రానున్న రోజుల్లో వాటర్ స్పోర్ట్స్ పేరు చెబితే విశాఖపట్టణమే గుర్తొచ్చేలా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్డీఓ జూన్, కెనాయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ బలరామ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఐపిఎల్ 2025 నిరవధిక వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

మధ్య లఖ్‌నవూలోని ఏకనా స్టేడియంలో మ్యాచ్ జరగాల్సి ఉంది. టోర్నీని వాయిదా వేసినప్పటికీ.. ఎప్పుడు పునఃప్రారంభిస్తారనేది బీసీసీఐ అధికారులు వెల్లడించలేదు. ప్రస్తుత సీజన్‌లో ఇంకా 12 లీగ్ మ్యాచులు ఉన్నాయి. రెండు క్వాలిఫయర్లు, ఒక ఎలిమినేటర్, ఫైనల్ మ్యాచ్ మిగిలి ఉంది. షెడ్యూల్ ప్రకారం మే 25న కోల్‌కతా వేదికగా ఐపీఎల్ ఫైనల్ ఉంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో గుజరాత్ (16), బెంగళూరు (16), పంజాబ్ (15), ముంబయి (14) ఉన్నాయి.

### 'ప్రత్యేక రైలు'కు అనుమతి లేదా?

భారత్ - పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో ఐపీఎల్ నిరవధికంగా వాయిదా పడింది. ధర్మశాలలో ఉన్న పంజాబ్, దిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లను, సిబ్బందిని అక్కడినుంచి దిల్లీకి తరలించేందుకు తొలుత ప్రత్యేక రైలును బీసీసీఐ ఏర్పాటుచేసింది. వందేభారత్‌లో తరలించేందుకు సిద్ధమైంది. అయితే, తాజా కథనాల ప్రకారం.. ఆ రైలు వెళ్లేందుకు రైల్వేశాఖ అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. పఠాన్‌కోట్ మీదుగా వెళ్లాల్సిన నేపథ్యంలో రిస్క్ తీసుకోదలుచుకోలేదని రైల్వే వర్గాలు తెలిపాయి. దీంతో మరోవిధంగా ఆటగాళ్లను తరలించేందుకు బీసీసీఐ ఏర్పాట్లు చేస్తోంది. బస్సుల్లో దిల్లీకి తీసుకెళ్లాలని భావిస్తోంది.

## సీఏ పరీక్షలు వాయిదా

**దిల్లీ:** భారత్, పాకిస్థాన్‌ల మధ్య ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా జరగాల్సిన సీఏ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈమేరకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఏఐ) అధికారికంగా ప్రకటించింది. మే 9 నుంచి మే 14 మధ్య జరగాల్సిన మిగిలిన సీఏ ఫైనల్, ఇంటర్మీడియట్, పోస్ట్ క్వాలిఫికేషన్ పరీక్షలు వాయిదా పడ్డాయని తెలిపింది. ప్రస్తుతం ఈ పరీక్షలకు హాజరు కానున్న అభ్యర్థులు మరిన్ని పూర్తి వివరాల కోసం ఐసిఏఐ వెబ్‌సైట్ icai.orgలో ద్వారా తెలుసుకోగలరు. ఈ పరీక్షలకు సంబంధించిన అన్ని పేపర్లను తిరిగి షెడ్యూల్ చేస్తామని ఐసిఏఐ ధృవీకరించింది. కొత్త పరీక్ష తేదీలను త్వరలో ఖరారు చేసి విడుదల చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చింది.

## పేదరికం వల్ల చదువుకోలేని పరిస్థితి రాకూడదు : సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. 2029 నాటికి పేదరికం లేని సమాజమే నా లక్ష్యం. ఆర్థిక అసమానతలను తగ్గిస్తాం. టెక్నాలజీ సరిగా వాడుకుంటేనే మనం ముందుకెళ్లగలం" అన్నారు.

### సైన్యానికి అండగా నిలబడదాం: చంద్రబాబు

శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీ నాయక్ వీర మరణం పట్ల సీఎం చంద్రబాబు సభలో రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మురళీ నాయక్ కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. "దేశాన్ని రక్షించగలిగిన సమర్థత ఉన్న నాయకుడు మోదీ ఒక్కరే. మన దేశం.. ఉగ్రవాదానికి ఎప్పటికీ వ్యతిరేకం. ప్రజాస్వామ్యంలో ఉగ్రవాదానికి స్థానం లేదు. ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటులేదని మోదీ ఏనాడో చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను మట్టుబెట్టిన ప్రభుత్వం కేంద్రంలో ఉంది. సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. దేశానికి సేవ చేసేందుకు యువత సైన్యంలో చేరుతున్నారు. సైన్యానికి మనమంతా అండగా ఉంటూ.. వారి పోరాటానికి మద్దతు ఇవ్వాలి" అని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

## ఆంధ్రా టు అబుదాబి..

(మొదటి పేజీ తరువాయి)

కొత్త విమానాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం-అబుదాబి మధ్య జూన్ 13 నుంచి విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని మంత్రి వెల్లడించారు. ఈ విమాన సర్వీసులు వారానికి నాలుగు రోజుల పాటు నడుస్తాయని పేర్కొన్నారు. అలాగే, విశాఖ- భువనేశ్వర్ విమాన సర్వీసు జూన్ 12 నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ సర్వీసుల ద్వారా ఏపీ, ఒడిశా మధ్య సంబంధాలు బలోపేతమవుతాయని పేర్కొన్నారు. విజయవాడ - బెంగళూరు మధ్య ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు జూన్ 2 నుంచి ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. ఈ సర్వీసుల ద్వారా ఏపీ రాజధాని ప్రాంతాన్ని భారతదేశంలోని ప్రధాన టెక్ హబ్‌లలో ఒకటైన బెంగళూరుకు అనుసంధానం కావొచ్చని తెలిపారు.

## డిల్లీలోని ఏపీ భవన్‌లో కంట్రోల్ రూమ్




**దిల్లీ:** భారత్-పాక్ ఉద్రిక్తతల దృష్ట్యా దిల్లీలోని ఏపీ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ భవన్‌లో కంట్రోల్ రూమ్ నంబర్లు 011-23387089, 98719 99430, 98719 99053ను ఏర్పాటు చేశారు. అదనపు సమాచారం, సహాయం కోసం డిప్యూటీ కమిషనర్ నంబర్ 98719 90081, లైజన్ ఆఫీసర్ నంబర్ 98183 95787ను అందుబాటులో ఉంచారు.

## రంగంలోకి టెరిటోరియల్ ఆర్మీ

(మొదటి పేజీ తరువాయి)

కలిసి పనిచేశారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగానూ సేవలు అందించారు. ఇటీవల కేరళ వరదల్లో స్టార్ నటుడు మోహన్ లాల్ తనవంతు సేవలు అందించిన సంగతి తెలిసిందే. అతడు కూడా టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ స్థాయి అధికారి. ఈ జాబితాలో పలువురు సెలబ్రిటీలు కూడా ఉన్నారు. భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ, సచిన్ పైలట్, కపిల్ దేవ్, అనురాగ్ ఠాకూర్, అభినవ్ బింద్రా.. లెఫ్టినెంట్ కర్నల్ స్థాయిలో ఉన్నారు. కనీస అర్హత సర్వీస్ పూర్తి చేసిన వారికి పింఛనుతోపాటు ఇతర ప్రయోజనాలు (క్యాంటీన్, మెడికల్, ఎల్‌టీ అలవెన్సులు) అందిస్తారు.

### టెరిటోరియల్ ఆర్మీ అంటే ఏంటి?

టెరిటోరియల్ లేదా ప్రాదేశిక ఆర్మీ గురించి సింపుల్‌గా చెప్పాలంటే సైనిక రిజర్వ్ ఫోర్స్. దేశంలో క్లిష్టపరిస్థితులు ఎదురైనప్పుడు భారత ఆర్మీతో కలిసి ప్రత్యర్థితో తలపడేందుకు టెరిటోరియల్ ఆర్మీ సిద్ధంగా ఉంటుంది. ఇందులోని సిబ్బంది, అధికారులకు రెగ్యులర్ ఆర్మీ తరహాలోనే శిక్షణ ఇస్తారు. వీరంతా బయట ఉద్యోగాలు చేసుకుంటూనే వాలంటరీగా సైన్యంతో పనిచేస్తుంటారు. 1948లో భారత టెరిటోరియల్ ఆర్మీ చట్టం ఆమోదించారు. ఆ తర్వాత 1949లో అధికారికంగా ప్రారంభమైంది. ప్రస్తుతం దాదాపు 50 వేల మంది వరకు ఈ ఆర్మీలో ఉన్నట్లు సమాచారం. వీరంతా రెగ్యులర్ ఆర్మీలో భాగమే అయినప్పటికీ.. నిరంతరం సైన్యంతోనే ఉండరు. అవసరమైన సందర్భాల్లో కదన, ప్రకృతి వైపరీత్యాల్లో రంగంలోకి దిగుతారు. టెరిటోరియల్ ఆర్మీ అధికారుల్లో పలువురు శౌర్య, విశిష్ఠ పురస్కారాలను అందుకొన్నారు.

## మా ప్రధాని పిరికిపంద

### పార్లమెంట్‌లో రెచ్చిపోయిన పాక్ ఎంపీ

**ఇస్లామాబాద్:** భారత్, బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీలు పాకిస్థాన్ పై విరుచుకుపడ్డాయి. ఈ క్రమంలో పాక్ నాయకులు వారి ప్రధాని షెహబాజ్ షరీఫ్ పై విమర్శలు గుప్పిస్తున్నారు. పాకిస్తాన్ పై దాడి చేసినట్లు బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ అధికారికంగా ప్రకటన చేసిన చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పాకిస్తాన్ లోని మొత్తం ఆరు స్థావరాలలో దాడులు చేసినట్లు తెలిపింది. ఈ క్రమంలో పార్లమెంట్‌లో కూడా పాకిస్థాన్ ప్రధాని పై ఆ దేశ ఎంపీలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. పాక్ పార్లమెంట్‌లోనే పాకిస్తాన్ ప్రధానిని, ఆర్మీ చీఫ్‌ను తిడుతూ ఓ ఎంపీ బూతులతో రెచ్చిపోయారు. యుద్ధాన్ని ఎదుర్కొలేక పిరికిపందల్లా దాక్కున్నారని వారిపై విమర్శలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అయితే భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పాకిస్తాన్ ప్రభుత్వానికి అక్కడి ప్రజలు మరో షాక్ ఇచ్చారు. రోడ్లపై నిరసన తెలుపుతున్నారు. పాకిస్తాన్ ప్రధాని షరీఫ్ విఫలమయ్యారని ఈ పాలన తమకు వద్దని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఇంటా.. బయటా దాడులతో పాక్ బెంబేలు

(మొదటి పేజీ తరువాయి)

ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్తాన్‌లో సామాన్యులతో పాటు చట్టసభల సభ్యులు కూడా బెంబేలెత్తిపోతున్నారు. సైనిక రిట్నైర్డ్ మేజర్, సీనియర్ ఎంపీ అయిన తాహిర్ ఇక్బాల్ ఆ దేశ పార్లమెంటులోనే ఏకంగా ఏడ్చేశారు. అధికార పార్టీ ఎంపీ అయిన ఇక్బాల్.. పార్లమెంటులో మాట్లాడుతూ కన్నీళ్లు పెట్టుకున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, ఇస్లామాబాద్‌లోని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ ఇంటి సమీపంలో భారత్ దాడులకు దిగింది. దీంతో తన నివాసం నుంచి పాక్ ప్రధాని పరారైనట్లు సమాచారం.

### పాక్ సైనిక బంకర్ల పాలిట మృత్యువు

భారత సరిహద్దుల్లో పాక్ సైన్యం నిర్విరామంగా పెద్దఎత్తున శతఘ్నులు, భారీ మెషిన్‌గన్స్‌తో షెల్లింగ్ చేస్తోంది. ఆ దేశ సైనికులు నక్కేందుకు అక్కడ ప్రత్యేకంగా బంకర్లు నిర్మించుకొన్నారు. వీటిని ఇప్పుడు భారత సైన్యం ధ్వంసం చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకమైన ఆయుధాన్ని వాడుతోంది. దానిని ఏటీజీఎం (యాంటీట్యాంక్ గైడెడ్ మిసైల్)గా వ్యహరిస్తారు. భారీగా సాయుధ కవచాలతో డిజైన్ చేసిన వాహనాలను ధ్వంసం చేయడానికి దీనిని వాడతారు. ఒక్కసారి దీనిలో ట్యాంక్ లేదా టార్గెట్‌ను లాక్ చేస్తే.. దానంతట అదే లక్ష్యాన్ని వెంటాడి ఛేదిస్తుంది. దీనిని భుజం పైనుంచి లేదా.. ట్రైపోడ్, వాహనాలపై అమర్చి ప్రయోగించవచ్చు. సురక్షితమైన దూరం నుంచి సాయుధ బలగాలను ఎదుర్కోవడానికి ఇది సరైన ఆయుధం. చాలావరకు ఏటీజీఎంల్లో షేపుడ్ ఛార్జి అనే దానిని వినియోగిస్తారు. ఈ పేలుడు పదార్థాల్లోని శక్తి మొత్తం ఒకే దిశలో కేంద్రీకృతమై ప్రయాణిస్తుంది. దీంతో మందపాటి సాయుధ కవచాన్ని కూడా ఛేదించేంత శక్తి ఇది విడుదల చేస్తుంది. కొన్ని అత్యాధునిక ఏటీజీఎంల్లో రెండుసార్లు పేలుళ్లు జరిగేలా ప్రత్యేకమైన వార్‌హెడ్లను వినియోగిస్తారు. తొలి పేలుడుకు ట్యాంక్‌కు బయట ఉన్న కవచం ధ్వంసం అవుతుంది. ఈ కవచాన్ని ఎక్స్‌ప్లోజివ్ రియాక్టివ్ ఆర్మర్ అంటారు. ప్రత్యర్థులు ప్రయోగించే క్షిపణుల వార్ హెడ్ దీనికి తగిలి మొదటే పేలిపోవాలన్న లక్ష్యంతో తయారుచేస్తారు. ఇలాంటివాటిని తట్టుకొని ట్యాంక్‌ను నాశనం చేయడానికి రెండో పేలుడు జరిగేలా తయారుచేస్తారు. తొలి పేలుడుకు సాయుధ కవచం, రెండో దానికి ట్యాంక్ ధ్వంసం చేయటమే వీటి లక్ష్యం. ఇక అన్నిరకాల పరిస్థితుల్లో పగలు, రాత్రి పని చేసి వీటిని తయారుచేశారు. వీటిల్లో కొన్నింటికి టాప్ అటాక్ మోడ్ ఉంటుంది. వీటిని ప్రయోగించాక గాల్లోకి ఎత్తుకు ఎగిరి.. ట్యాంక్ టాప్‌పై పడుతుంది. దీనిలో డ్యూయల్ మోడ్ సీకర్ అనే ఆప్షన్ ఉంది. ఇది లక్ష్యాన్ని గుర్తించి.. దానిని అనుసరించేలా చేస్తుంది.

### ఏటీజీఎంను ఆపగలరా..?

కొన్ని ట్యాంకులు రీయాక్టివ్ ఆర్మర్ అనే కవచాన్ని వాడతాయి. వీటిపై కొన్నిరకాల ప్రత్యేకమైన ప్లేట్లు ఉంటాయి. ఏటీజీఎం తాకగానే బయటవైపునకు పేలుడు జరుపుతాయి. మరికొన్ని దేశాలు లోహపు పంజరం వంటి వాటిని ట్యాంకులపై అమరుస్తున్నాయి. ఏటీజీఎం వీటిని తాకి ముందే పేలిపోతాయి. ఇక క్షిపణుల సిగ్నల్స్‌ను జామ్ చేసే వ్యవస్థలు వాడటం.. లేదా డికాయ్‌లను ప్రయోగించి క్షిపణిని గందరగోళానికి గురిచేయడం చేయవచ్చు. ఇజ్రయెల్ వద్ద ట్రోఫీ అనే ప్రత్యేక వ్యవస్థ ఉంది. అవి ట్యాంకర్ పైకి వచ్చే క్షిపణులను ముందే గుర్తించి పేల్చేస్తుంది. ఈ వ్యవస్థలు చాలా తేలిగ్గా.. వేగంగా.. స్మార్ట్‌గా పనిచేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 130కి పైగా దేశాలు ఏటీజీఎంలను వినియోగిస్తున్నాయి. ఇక ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ కూడా వీటిని వినియోగిస్తోంది. ప్రస్తుతం భారత్ వద్ద నాగ్, ధ్రువాస్త్ర (హెలినా) వంటివి ఉన్నాయి.

# వైభవంగా అనంత పద్మనాభస్వామి శిఖర ప్రతిష్ట

రూ.5 కోట్లతో నిర్మించిన ఘాట్ రోడ్డు ప్రారంభించిన గంటా



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** పద్మనాభం మండలంలోని అనంత పద్మనాభస్వామి వారి ఆలయంలో శుక్రవారం శిఖర ప్రతిష్ట జరిగింది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గోవింద నామ స్మరణల మధ్య వైదికులు స్వామి వారి శిఖరాన్ని ప్రతిష్టించారు. రూ.60 లక్షలతో విమాన గోపురం, అర్ధ మండపం, ముఖ మండపం నిర్మించారు. అలాగే అనంతుని ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన యాగంలో గంటా పాల్గొన్నారు. అనంతరం అనంత పద్మనాభస్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే ఈ ప్రాంతవాసుల దశాబ్దాల కల అయిన అనంత పద్మనాభస్వామి ఆలయ ఘాట్ రోడ్డును ప్రారంభించారు. ఘాట్ రోడ్డును రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఆలయానికి సంబంధించిన రెండు ప్రధాన పనులను ఒకేరోజు ప్రారంభించడం పట్ల ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# పోలీస్ హెల్మెట్ తనిఖీలు



**తాళ్లపూడి విశాఖ సమాచారమ్**
**కొవ్వూరు నియోజకవర్గ ప్రతినిధి కొల్లి వెంకట చిన్నబాబు :-**
తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామంలో తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ గారి ఆధ్వర్యంలో పోలీస్ శాఖ వారు డ్రైవింగ్ లైసెన్స్ చెకింగ్, టూ - వీలర్ మోటార్ సైకిల్ రికార్డ్ చెకింగ్, హెల్మెట్ చెకింగ్, రేష్ డ్రైవ్ చేస్తున్న యువకులను ఎప్పటికప్పుడు అదుపు చేస్తున్నారు.

ప్రాణం కన్నా హెల్మెట్ మిన్న అని చెబుతూ ఎప్పటికప్పుడు డ్రైవ్ నిర్వహిస్తున్నారు

ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ రవి, హోంగార్డ్ గంగాధర్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):-** భీమిలి రూరల్ మండలం మజ్జివలసలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. 16 పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో బీసీ కార్పొరేషన్ ద్వారా ఆన్ లైన్ లో పేర్లు నమోదు చేసుకున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇస్తుందన్నారు. శిక్షణ అనంతరం ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ కూడా చేస్తామన్నారు. గ్రామాల్లోని మహిళందరూ పేర్లు నమోదు చేసుకొని ఉచిత కుట్టు మిషన్ ద్వారా ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో భీమిలి జడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, మాజీ జడ్పీటీసీ సరగడ అప్పారావు, పంచాయతీ విస్తరణ అధికారి రమేష్ నాయుడు, నీలాపు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భానుడి భగభగ... ప్రకాశం జిల్లాలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత

- **ప్రకాశం దరిమడుగులో 42%C, తిరుపతి గంగుడుపల్లెలో 41.3°C**
- **కోనసీమ ఆత్రేయపురంలో 63.7మిమీ, చొప్పెలలో 55మిమీ వర్షపాతం**
- **నేడు 3 మండలాల్లో తీవ్ర వడగాలులు, 23 మండలాల్లో వడగాలులు**
- **అల్లూరి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో పిడుగులతో వర్షాలు**
- **ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్డీఎంఏ సూచన**

**అమరావతి, (విశాఖ సమాచారమ్):-** ఏపీలో కొన్ని జిల్లాల్లో భానుడు ప్రతాపం చూపిస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వర్షాలు కురుస్తున్నాయి. నేడు రాష్ట్రంలోని పలుచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదవగా, కొన్ని ప్రాంతాల్లో వర్షం పాతం నమోదైంది. రేపు శనివారం కూడా ఇదే తరహా వాతావరణం కొనసాగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) కీలక సూచనలు జారీ చేసింది.

ఇవాళ ప్రకాశం జిల్లా దరిమడుగులో అత్యధికంగా 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, తిరుపతి జిల్లా గంగుడుపల్లెలో 41.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు ఏపీఎస్డీఎంఏ తెలిపింది.

మరోవైపు, కొన్ని జిల్లాల్లో వాతావరణం చల్లబడింది. కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో అత్యధికంగా 63.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అదే జిల్లా చొప్పెలలో 55 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆకస్మిక వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

**వాతావరణ సూచన**

శనివారం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుంచి 43.5 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ అంచనా వేసింది. మూడు మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 23 మండలాల్లో వడగాలుల ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిదని సూచించింది.

అదే సమయంలో, రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ పేర్కొంది. అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇతర జిల్లాల్లో కూడా చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**
**టెండరు కోరుతూ ప్రకటన**
టెండరు నం.30247143A. తేది: 06.05.2025
పని పేరు: RDSO FRS No. RDSO / 2023/EL/FRS/0034 (Rev.0)కు నిర్ధారించే DRG No. WCR/TKD/EL/3-GEN-105 ప్రకారం ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లో వాటర్‌లెస్ యూరినల్ సరఫరా మరియు స్థాపన, (1) డోర్ హ్యాండిల్, (2) డోర్ లాచ్, (3) ICF / CLW అప్రూవ్డ్ సోర్స్ నుండి LED లైట్, 8W, 110V, ఫిటింగ్స్ ఇన్‌సైడ్, (4) ఎగ్జాస్ట్ ఫ్యాన్, 24W, 110V, (5) పర్ఫ్యూమ్ డిస్పెన్సర్ ఎయిర్ ఫ్రెష్నర్‌తో బిగించబడిన గ్రేడ్ SS 304 వాల్ మౌంటెడ్ ఎంక్లోజర్‌తో పౌడర్ కోటెడ్ & మాట్ ఫినిష్‌తో పఫ్ ఫిల్డ్ వాల్ ప్యానెల్స్ ఏర్పాటు, SS 304తో తయారు చేయబడిన ఎంక్లోజర్. గమనిక: లోకోమోటివ్‌లో స్పేస్ లభ్యత ప్రకారం ఎత్తులో డైమెన్షన్స్ టోలరెన్స్ +/-50మి.మీ.
(వారంటీ వ్యవధి: బట్వాడా తేదీ తరువాత 30 నెలలు)
పరిమాణం: 80 నం.లు
గమనిక: మెటీరియల్‌ను 180 రోజుల్లోగా సరఫరా చేయవలెను.
టెండరు తెరచు తేది మరియు సమయం: 29.05.2025న 1500 గం.
TPI ఏజెన్సీచే తనిఖీ
పూర్తి వివరాలు www.ireps.gov.inలో లభిస్తాయి
సీనియర్ డివిజినల్ మెటీరియల్ మేనేజర్ / వాల్తేరు
PR-113/Q/25-26

# దేశీయ విత్తనాలతో పండే పంటలే ఆరోగ్యకరం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** దేశీయ విత్తనాలతో పండె పంటలే ఆరోగ్యకరం అని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం విశాఖపట్నం, ద్వారకా నగర్ లోని పౌర గ్రంధాలయం లో వరికంకుల గుత్తులు తోరణాలు తయారు చేయడం మీద శిక్షణ , విత్తనాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూరగాయలు , ఆకుకూరల విత్తనాలు 130 రకాలు ప్రదర్శన లో ఏర్పాటు చేసామన్నారు. దేశీయ విత్తనాల సేకరణ, పునరుత్పత్తికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మన పొట్ట చెత్త బుట్ట కాదని ఆరోగ్య కరమైన ఆహారం భుజించాలి అని కోరారు. దేశంలో 10 వేల సంవత్సరాల క్రితం నుంచి విత్తనాలు దాచుకుంటూ వస్తున్న వారి వద్దకు వెళ్ళి ఈ దేశియ విత్తనాలు సేకరించడం జరుగుతుంది అన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది అన్నారు.

ఈ కార్యక్రమంలో బయొడైవర్శిటీ బోర్డు రీజనల్ ఎగ్జిక్యూటివ్ జానకీ రావు, జివిఎంసి ఎస్ ఆర్ యు ప్రతినిధులు దివ్య, ప్రమీల, మంగరాజు, ఎవిఎన్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అర్చన, ఎస్ ఎఫ్ ఎస్ విద్యా సంస్థ అధ్యాపకులు శివ లక్ష్మి, వనమాలి సిటిజి అడ్మిన్ మళ్ళ సరిత, వనమాలి ఇన్చార్జి లు ఆత్మాంబిక , రేఖ, ఉష, మినియేచర్స్ ఇన్చార్జి రమాదేవి, గ్రీన్ వాలంటీర్లు జె రాజేశ్వరి ఐ కృష్ణ కుమారి తదితరులు పాల్గొని మాట్లాడారు.

# నాటు కోళ్ల పెంపకంలో మహాలక్ష్మీ విజయ గాధ

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** వ్యవసాయ ఆదాయమే ప్రధాన వనరుగా, సాగులో లాభాలు శూన్యమవుతున్న పరిస్థితులలో పెదనందిపల్లి అగ్రహారానికి చెందిన మహాలక్ష్మీ నాటు కోళ్ళ పెంపకం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుని తోటి రైతులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. తన విజయ గాధను విశాఖ సమాచారమ్ ప్రతినిధి కి ఆమె ఈ విధంగా తెలియజేస్తున్నారు.



నేను వేచలపు మహాలక్ష్మీ నా భర్త వేచలపు సింహాచలం మాది పెద నందిపల్లె అగ్రహారం అనకాపల్లి జిల్లా మా కుటుంబం ప్రధానంగా వరి, అపరాలు సాగు చేస్తూ వుంటాము. వ్యవసాయమే మాకు ప్రధాన ఆదాయం. నేను పెద్ద గా ఏమి చదువుకోలేదు. గత ఆరు సంవత్సరాలుగా మేము రిలయన్స్ ఫౌండేషన్‌తో అనుబంధంలో ఉన్నాము. వరి, అపరాల పంటల సాగులో రైతులకు లాభం అంతగా లేకపోవడం, అధిక పెట్టుబడులు, కూలీ ఖర్చులు ఎక్కువ, దిగుబడులు ఆదాయం తక్కువ అవుతున్న కారణంగా ఇద్దరు ఆడ పిల్లలతో జీవనం కష్టంగా మారింది. అదనపు ఆదాయం కోసం మార్గాల గురించి నిరంతరం ఆలోచన సాగేది. కానీ ఏమి చేయాలో అర్థమయ్యేదికాదు.

నా భర్త రిలయన్స్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన డిజిటల్ ఫార్మ్ స్కూల్‌లో సభ్యులుగా ఉన్నారు. ఫౌండేషన్ వారు మా గ్రామానికి కృషి విజ్ఞాన్ కేంద్రం కొండెంపూడి శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మేము నాటు కోళ్ళ పెంపకంపై అడిగి తెలుసుకున్నాము. దీని ద్వారా అదనపు ఆదాయం కొరకు దృష్టి పెట్టాం. కృషి విజ్ఞాన్ కేంద్రం కొండెంపూడి శాస్త్రవేత్తల సలహాలతో మేము తొలుత 10 నాటు కోడి పిల్లల్ని కొనుగోలు చేశాము. అయితే ప్రారంభంలో అవగాహన లేకపోవడంతో 50 శాతం కోడి పిల్లలు కొక్కిరికో రాటి కార్డ్ వైరస్ వచ్చి మరణించాయి. అప్పటికే పరిచయం వున్న రిలయన్స్ ఫౌండేషన్ టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించడంతో వారు మండల పశు సంవర్ధక శాఖ అదికారికి కనెక్ట్ చేశారు. కోళ్ళ పెంపకంలో ముందస్తు వ్యాక్సినేషన్, పోషకాహారం, సంరక్షణ పద్ధతులు అవసరం అని వాటిని తప్పన సరిగా సమయానుకూలంగా పాటించాలని ఆ డాక్టర్ తెలియజేశారు. ఆ తరువాత నేను సొంతం గా వ్యాక్సినేషన్ చేయడం నేర్చుకున్నాను. అప్పటినుండి మేము చేపట్టిన జాగ్రత్తల వలన మిగిలిన కోడి పిల్లలు ఆరోగ్యంగా పెరిగి, 6 నెలలలో 2.5 నుండి 3 కేజీల బరువుకు పెంచగలిగాను. కోళ్ళ సంఖ్యను కూడా క్రమంగా అబివృద్ధి చేసికో గలిగాను. పండగల సమయంలో ఎక్కువ డిమాండ్ వుంటుంది కావున ఒక్కో కోడి కిలో రూ.700 నుండి రూ.800 చొప్పున అమ్మగలిగాము. అ విధంగా ఒక కోడి 2600 రూపాయలు కి అమ్మా గలిగాను. ప్రస్తుతం 100 నాటు కోళ్ల వరకు పెంపకాన్ని విస్తరించాను. అంచనా ప్రకారం ఇప్పుడు నా వద్ద ఒక లక్ష రూపాయల విలువ చేసే కోళ్లు ఉన్నాయి. నెలకు సగటుగా రూ. 25,000 అదనపు ఆదాయం పొందగలుగుతున్నాను. కోళ్ళ పెంపకం పై మంచి అవగాహన ఏర్పడింది. ఈ విజయాన్ని చూసి మా గ్రామంలోని పలువురు రైతులు కూడా నాటుకోళ్ళ పెంపకాన్ని ఆచరిస్తున్నారు. సరైన సమయానికి యాజమాన్య పద్ధతులు ఆచరించటం ద్వారా సాంకేతిక టెక్నాలజీ పొందడం ద్వారా తీసుకున్న సలహాలు, శాస్త్రవేత్తల మార్గదర్శనంతో నేను స్థిరమైన ఆదాయ మార్గాన్ని ఏర్పరుచుకో గలిగాను. రిలయన్స్ ఫౌండేషన్ అందించిన సాంకేతిక అవగాహన, నిబద్ధత, మార్గదర్శనం వల్ల మా కుటుంబ జీవితం ఆర్థిక స్థిరత్వం సాధించింది. ఇప్పుడు మేము ఇద్దరు పిల్లలను విశాఖపట్నం లో ప్రెసిద్ధి పొందిన పాఠశాలలో చదివించుకో గలుగుతున్నాము. ఇప్పుడు నేను మార్గదర్శిగా మారాను మా గ్రామంలో అనేకమంది రైతులు నాటుకోళ్ళ పెంపకాన్ని ప్రారంభించారు. ఇది నాకు గర్వకారణం.

# బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత

## తమ్మంగుల సర్పంచ్ లక్ష్మయ్య



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):-** బాల్య వివాహాలను అరికట్టి బాలికలకు బంగారు భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా వాసవ్య మహిళా మండలి చేస్తున్న కృషి అభినందనీయమని తమ్మంగుల సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య అన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంలో భాగంగా ఐసిడిఎస్ నిర్వహిస్తున్న కిశోర వికాసం వేసవి సెలవుల కార్యక్రమంలో భాగంగా తమ్మంగుల పంచాయతీ లో వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు సాగిన చిట్టిబాబు, సాగిన మంగ కుమారి తలారి రాధ, సీనియర్ అంగన్వాడీ కార్యకర్త పెంటమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు బాల్య వివాహాలను అరికట్టడం, బడి బయట పిల్లలను బడిలో చేర్పించడం, యువతి యువకులకు వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ ఇప్పించడం, బాల్య వివాహాల వలన కలుగు అనర్ధాలపై అవగాహన కల్పించడం, తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఐసిడిఎస్, వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు అభినందనీయులు అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ముందుగా తమ పంచాయితీలో నిర్వహించడం తమకెంతో గర్వకారణం అన్నారు. మన్యంలో అవగాహన లోపం వలన అనేక అనర్ధాలు చోటు చేసుకుంటున్నాయని, విద్యార్థి దశలో బాల బాలికలు బడి బయట ఉండడం వలన వారి భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారే ప్రమాదం ఉందని, అదే విధంగా యువతి, యువకులు తమలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం, బాల్య వివాహాల వలన భవిష్యత్తులో జరిగే అనర్ధాలపై అవగాహన కల్పించడం తదితర కార్యక్రమాలను నిర్వహించడం వలన ఈ ప్రాంతంలో యువతి, యువకులు సన్మార్గాన్ని ఎంచుకోవడం వలన వారి భవిష్యత్తు బాగుపడడమే గాక మంచి సమాజ స్థాపనకు అది దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి, ఆశ కార్యకర్తలతో పాటు కిశోర బాలికలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సామాజిక శాస్త్రాల నైపుణ్యం సమాజానికి అవసరం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** సామాజిక శాస్త్రాల నైపుణ్యం మరియు ఆవశ్యకత సమాజానికి చాలా అవసరం ఉందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ నర్సింగరావు గారు గెస్ట్ ఫ్యాకల్టీ లను ఉద్దేశించి తెలియజేశారు ఆర్ట్స్ కళాశాల అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగి ఉన్నారని ఈ సందర్భంగా తెలియజేశారు ఆర్ట్స్ కళాశాలలో సుమారుగా 20 డిపార్ట్మెంట్లు 28 కోర్సులు ప్రస్తుతం ఉన్నాయని .ఈ సందర్భంగా తెలియజేశారు ఆంధ్ర యూనివర్సిటీ అధ్యాపకులు ప్రిన్సిపాల్ గారి 60వ జన్మదిన వేడుకలను ఘనంగా ప్రిన్సిపల్ ఆఫీస్ ఛాంబర్ నందు నిర్వహించారు. అతిథి అధ్యాపకులు అందరికీ కూడా నెలవారి జీతాలు వచ్చేలా ప్రభుత్వంతో చర్చలు జరిపి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం సురేష్ మీనన్ డాక్టర్ ముసుగు ప్రసాద్, డా.దాక్షాయిని, డా.పద్మజ, డా.దేవదానం, డాక్టర్ త్రినాథ్, డాక్టర్ గిరీష్ డాక్టర్ దాస్ డాక్టర్ ప్రసాద్ డాక్టర్ శిరీష్, డాక్టర్ ఆశ, డాక్టర్ రవి, డాక్టర్ అంబేద్కర్, డాక్టర్ శ్రీను, పితాని ప్రసాద్, డా.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడల మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయి

గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరావు



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):-** క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని బిజెపి నాయకుడు, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కదుళ్ళ శ్రీనివాసరావు, అల్లూరి జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు గొర్లె సోమేష్ లు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న యూనిటీ కప్ చింతపల్లి సీజన్ 3 క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా శుక్రవారం హోరాహోరీగా జరిగిన చింతపల్లి 40 ప్రోస్, బంధ వీధి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో చింతపల్లి 40 ప్రోస్ జట్టు విజేతగా నిలిచింది. జట్టు విజయానికి పదవ ఓవర్ ఆఖరు బంతి కి ఒక్క రన్ చేస్తే విజయం వరిస్తుందన్న ఉత్కంఠ భరిత వాతావరణం లో 40 ప్రోస్ కెప్టెన్ చల్లంగి నరేష్ చాకచక్యంగా ఆడి రన్ చేయడంతో విజయం 40 ప్రోస్ క్రీడాకారులను వరించింది. జట్టు విజయంలో బౌలింగ్ లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడు తేజను మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తేజ కు కదుళ్ల శ్రీనివాసరావు, గొర్లి సోమేశ్ ల చేతుల మీదుగా మేన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు.

# 400 డ్రోన్‌లతో పాకిస్థాన్ దాడి

భారత్‌లోని కీలక సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ భారీ స్థాయిలో డ్రోన్ల దాడికి పాల్పడిందని భారత ప్రభుత్వం వెల్లడించింది. జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోని సుమారు 36 ప్రాంతాలపై 300 నుంచి 400 డ్రోన్లను ప్రయోగించిందని భారత సైన్యం తెలిపింది. ఈ దాడుల వెనుక భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచారాన్ని సేకరించడమే పాక్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొంది.

'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ఈ సంచలన విషయాలను తెలిపారు.

గురువారం రాత్రి పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు దిగి, నియంత్రణ రేఖ వెంబడి ఉల్లంఘనలకు పాల్పడుతూ భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు ప్రారంభించిందని వారు వివరించారు. పాక్ వైపు నుంచి వచ్చిన అనేక డ్రోన్లను భారత బలగాలు కూల్చివేశాయని, ఈ ఘటనల్లో పలువురు గాయపడ్డారని వారు పేర్కొన్నారు. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తత కొనసాగుతోందని, పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుందని తెలిపారు. దాడుల కోసం టర్కీకి చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' రకం డ్రోన్లను పాకిస్థాన్ ఉపయోగించినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలిసిందన్నారు.

**పౌర విమానాలను రక్షణ కవచాలుగా వాడుకుంది**

ఈ దాడుల సందర్భంగా పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా వాడుకుందని భారత రక్షణ శాఖ ప్రతినిధులు తీవ్ర ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు ప్రారంభించినప్పటికీ, కరాచీ, లాహోర్ మధ్య పౌర విమాన సర్వీసులను నిలిపివేయలేదని వారు తెలిపారు. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన వస్తుందని తెలిసి కూడా, పౌర విమానాలను అడ్డుపెట్టుకోవడం ద్వారా పాకిస్థాన్ అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరించిందని అన్నారు.

ఇది భారత్-పాక్ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో ప్రయాణించే విమానాలతో పాటు, పాకిస్థాన్‌లోని పౌర విమానాలకు కూడా సురక్షితం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, పాకిస్థాన్ ప్రార్థనా మందిరాలను కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోందని, ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు.

అంతర్జాతీయ విమానయాన నిబంధనలను, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని భారత వాయుసేన పూర్తి సంయమనంతో వ్యవహరించిందని కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు స్పష్టం చేశారు. పాకిస్థాన్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి కవ్వింపు చర్యలను భారత్ ఉపేక్షించబోదని వారు హెచ్చరించారు.

# పరీక్షలలో మాల్ ప్రాక్టీస్ కి పాల్పడితే కఠిన చర్యలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరీక్షల విధానాన్ని మరింత పటిష్టం చేసే విధంగా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇటీవల ఏయూ పరిధిలో నిర్వహించిన పలు పరీక్షలలో కొంతమంది విద్యార్థులు అనైతికమైన చర్యలకు పాల్పడడం, మాల్ ప్రాక్టీస్ చేయడం అదికారుల దృష్టికి వచ్చింది. వీటిని గుర్తించిన అధికారులు వెంటనే ఇటువంటి విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పరీక్షలకు సంబంధించిన నియమావళికి అనుగుణంగా వీరిపై సత్వర చర్యలు తీసుకోమన్నారు.

ఏయూ పరిధిలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరీక్షలను ప్రత్యేకంగా నియమించిన తనిఖీ బృందాలు, ప్రత్యేక పరిశీలకులు నిరంతరం పర్యవేక్షణ, పరిశీలన చేసి పరీక్షా కేంద్రాల్లో కొంతమంది విద్యార్థులు చీటీలు పెట్టి రాయడం, పుస్తకాల్లో చూసి రాయడం, మొబైల్ ఫోన్లో చూసి రాయడం వంటి చర్యలకు పాల్పడడాన్ని గుర్తించారు. ఇటువంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పరీక్షల విభాగానికి వీరిపై నివేదికను పరీక్షల తనిఖీ అధికారులు పంపారు. మాల్ ప్రాక్టీస్ కి పాల్పడిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంటారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన విద్యార్థుల పరీక్ష ను రద్దు చేయడం, నిర్దిష్ట కాలం పాటు వారు పరీక్ష రాయకుండా నిషేధించడం, అదేవిధంగా ఇటువంటి చర్యలను ప్రోత్సహించిన కళాశాల యాజమాన్యం, కళాశాల సిబ్బంది పైన క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో పరీక్షా కేంద్రాల్లో నడుచుకోవాలని పరీక్షల నియమాలను పూర్తిస్థాయిలో పాటించాలని ఏయు అధికారులు స్పష్టం చేశారు..

2nd pages11.qxd 5/9/2025 8:01 PM Page 4



విశాఖ సమాచారమ్
శనివారం 10-5-2025

## ఈ యుద్ధం మనం కోరుకున్నది కాదు

పాక్‌తో యుద్ధం ప్రారంభమైనట్లే! అయితే ఇది మనం కోరుకున్నది కాదు. మన ప్రమేయం లేకుండా వచ్చిపడిన విపత్తు. అకారణంగా మనపై రుద్దిన సంక్లిష్ట సమస్య. దీనికి దీటుగా స్పందించకపోతే ఉగ్రదాడులకు అంతూ పొంతూ ఉండదు. కనుకనే పహల్‌గామ్ మారణకాండ గురించి తెలియగానే కేంద్ర ప్రభుత్వం గట్టి సమాధానం ఇచ్చింది. భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో జగడాలమారి పాకిస్తాన్‌కూ, దాని కీలుబొమ్మల్కెన ఉగ్రమూకలకూ తెలిసొచ్చి ఉండాలి. 2016 నాటి 'ఉరి' సర్జికల్ దాడులు, 2019 నాటి బాలాకోట్ వైమానిక దాడులకు అనేక రెట్లు అధికంగా మంగళవారం అర్ధరాత్రి దాటాక 'ఆపరేషన్ సిందూర్' సంకేతనామంతో మన త్రివిధ దళాలు పకడ్బందీ సమన్వయంతో పాకిస్తాన్‌లోనూ, ఆక్రమిత కశ్మీర్ లోనూ క్షిపణి దాడులతో పాక్ సైన్యాన్నీ, ఉగ్రమూకల్నీ గుక్క తిప్పుకోనీయకుండా చేశాయి. ఇప్పటికీ ఈ ఆపరేషన్ కొనసాగుతూనే ఉంది. పాకిస్థాన్ కాల్పుల ఉల్లంఘన ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో మన భద్రతా దళాలు తిప్పికొడుతున్నాయి. దీంతో యుద్ధం ప్రారంభమైనట్లేనని భావించాలి.

ఉగ్రవాదుల శిక్షణ కేంద్రాలూ, వారి ఆయుధ గిడ్డంగులూ, ఇతరేతర అవసరాలకు వినియోగిస్తున్న బహుళ అంతస్తుల భవంతులూ లక్ష్యంగా మొత్తం 24 చోట్ల సాగించిన దాడుల్లో 100 మంది వరకూ ఉగ్రవాదులు మరణించినట్లు మన రక్షణ మంత్రి ప్రకటించారు. ఉగ్రవాద ముఠాల్కెన జ్కెషే మొహమ్మద్ (జేఈఎం), లష్కరే తోయిబా(ఎల్ఈటీ) ప్రధాన కార్యాలయాలు రెండూ కుప్పకూలాయని సమాచారం. సంప్రదాయానికి భిన్నంగా ఈసారి పాక్ లోపలివరకూ చొచ్చుకెళ్లి దాడులు సాగించిన తీరూ, ఒక్క క్షిపణి కూడా గురితప్పకుండా శత్రుమూకలపై చంద్రనిప్పులు కురిపించిన విధానం మన త్రివిధ దళాల పకడ్బందీ అంచనాలకూ, పదున్కెన వ్యూహచతురతకూ దర్పణాలు. పాక్ గడ్డపై గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఉగ్రశిబిరాల ఆనుపానుల్ని శత్రునేత్రానికి చిక్కని విధంగా గత పక్షం రోజులుగా మానవ రహిత విమానాలతో జల్లెడపట్టాకే ఈ దాడులు జరిగాయి.

పహల్‌గామ్ సమీపంలో అకారణంగా, అన్యాయంగా నిరాయుధ భారత పౌరులను గురిచూసి కాల్చిచంపటానికి కిరాయిమూకల్ని పంపి కొన్నిరోజులుగా పాకిస్తాన్ మురిసిపోతోంది. దీనిపై నిలదీస్తే షరా మామూ లుగా సాక్ష్యాలడుగుతోంది. గత నెల 22న పహల్‌గామ్ సమీపంలో ఉగ్రవాద ముఠా 26 మందిని పొట్టనబెట్టుకున్నప్పటి నుంచీ భారత ప్రజ ప్రతీకారంతో రగిలిపోతోంది. కంటికి కన్ను సిద్ధాంతం పాటించి గట్టి దెబ్బతీయాల్సిందేనన్న అభిప్రాయం అలుముకుంది. ఈ నేపథ్యంలో మన దళాల దాడులు విజయవంతం కావటం అందరినీ సాంత్వన పరుస్తుందనటంలో సందేహం లేదు. కేంద్ర మంత్రివర్గ సహచరులతో, త్రివిధ దళాల అధిపతులతో వరస సమాలోచనలు సాగిస్తున్నారు. ఎప్పుడు, ఎక్కడ ఎలా దాడులు సాగించాలో, తీవ్రత ఏ స్థాయిలో వుండాలో మీరే నిర్ణ యించండంటూ మన దళాలకు అధికారం ఇచ్చారు. పర్యవసానంగానే పాక్ ప్రాపకంతో చెలరేగి పోతున్న ఉగ్రముఠాలకు గట్టి సమాధానం వెళ్లింది. ఈ దాడులకు చాలాముందే ఇతరేతర నిర్ణ యాలు తీసుకున్నారు. సింధూ నదీజలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపేస్తున్నట్టు ప్రకటించ టంతోపాటు ఇండియా పలు చర్యలు తీసుకుంది. దీన్నంతటినీ గమనిస్తున్నవారికి మన దేశం సైనిక చర్యకు కూడా వెనకాడబోదని పక్షం రోజుల క్రితమే అర్థమైంది. యుద్ధం దేనికీ పరిష్కారం కాకపోవచ్చు. చర్చలే అంతిమంగా ఎంతటి జటిల సమస్య్కెనా పరిష్కరిస్తాయన్న సిద్ధాంతం కూడా సరైనదే కావొచ్చు. కానీ పొరుగు పచ్చగావుంటే ఓర్వలేక నిష్కారణంగా దాడులకు దిగే న్కెజాన్ని శాంతిప్రవచనాలతో ఎదుర్కొనటం సాధ్యమేనా? ఒకపక్క పహల్‌గామ్ దాడులతో సంబంధం లేదంటూనే గత కొన్ని రోజులుగా అధీనరేఖ వద్దా, అంత ర్జాతీయ సరిహద్దు వద్దా పాక్ ఎలాంటి కవ్వింపూ లేకుండా కాల్పులకు దిగుతోంది. ఈ దాడుల కారణంగా ఒక్క బుధవారంనాడే పూంఛ్ జిల్లా గ్రామాల్లో 12 మంది పౌరులు బలయ్యారు. తన దుష్ట పన్నాగాలను కప్పిపుచ్చటానికి భద్రతామండలిలో పాకిస్తాన్ అమాయకత్వం నటిస్తూ భారత్ తీసు కుంటున్న వరస చర్యలకు వ్యతిరేకంగా తీర్మానం చేయించాలని విఫలయత్నం చేసింది. రేపో మాపో అది నేరుగా సైన్యాన్ని రంగంలోకి దించి ప్రతీకారం పేరిట చెలరేగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఉగ్రముఠాల ద్వారా మారణహోమానికి పాల్పడటం కన్నా ఒకరకంగా ఇది మంచిదే. భారత్ బెదిరిపోయి సైనిక దాడుల ఆలోచన మానుకుంటుందన్న తప్పుడు ఆలోచనతో కొన్ని రోజులుగా అది అణుబాంబు బెదిరింపులకు కూడా తెగించింది.

ఆ దుస్సాహసానికి పూనుకుంటే చేజేతులా స్వీయవినాశనాన్ని కొనితెచ్చుకున్నానని పాక్ పశ్చాత్తాపపడే రోజు ఎంతో దూరంలో ఉండదు. ఈ కష్టకాలంలో దేశ ప్రజానీకం కుల మత భేదాలు మరిచి కలిసికట్టుగా ఉండటం అత్య వసరం. ఇదే అదనుగా నాలుగు ఓట్ల కోసమో, మరికొన్ని సీట్ల కోసమో ప్రజల్లో వైషమ్యాలు సృష్టించాలని చూసే అవాంఛనీయ శక్తుల్ని అందరూ సకాలంలో పోల్చుకుని దూరం పెట్టడం, తగిన బుద్ధి చెప్పటం ఎంతో అవసరం. మనలోని సమష్టితత్వమే ఎంతటి విపత్తున్కెనా ఎదుర్కొనే ధ్కెర్యాన్ని స్తుంది. విజయాన్ని మన చేతికందిస్తుంది.

# దివాళా దశన ఉన్నా.. పాక్ బరి తెగింపులు!

డాలర్ తో ఇప్పుడు పాక్ రూపాయి మారకం విలువ 308 గా ఉంది! భారత రూపాయికి అమెరికన్ డాలర్ మారకం విలువ ప్రస్తుతం 85 రూపాయల వరకూ ఉంటే, పాకిస్తాన్ ఒక డాలర్ సంపాదించాలంటే ఏకంగా 308 రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితుల్లో ఉంది. పాక్ లో విపరీత స్థాయిలో ఉన్న ద్రవ్యోల్బణానికి , పాక్ కరెన్సీ విలువ పతనానికి ఇది తార్కాణంగా నిలుస్తూ ఉంది.

రెండు మూడేళ్ల కిందట పాక్ తీవ్రమైన కరువులో మగ్గింది. విపరీతమైన వరదలతో.. గోధుమ పంటలు దుంపనాశనం అయ్యాయి. దీంతో ఆఖరికి గోధుమలు దొరక్క పాక్ అలమటించింది. ఎక్కడ్కెనా గోధుమలు కనిపిస్తే దొంగతనాలు జరిగాయి. ప్రజలు దండెత్తి గోధుమలను దోచుకోవడం పాక్ లో కనిపించింది. వాస్తవానికి చాలా దుర్భరమైన పరిస్థితుల్లో ఉంది పాకిస్తాన్.

దీనికి తోడు రాజకీయంగా పాక్ దుర్గతిని గురించి ఎంత చెప్పుకుంటే అంత తక్కువ! ఎప్పుడు ఏ ప్రభుత్వం ఉంటుందో, ఎప్పుడు ఏ పాలకుడు దేశం విడిచి పరార్ అవుతాడో ఎవ్వరూ చెప్పలేరు! ఆర్థికంగా స్థితిమంతులు ఎప్పుడో పాక్ ను దాటేస్తూ ఉన్నారు. యూరప్ దేశాలను, గల్ఫ్ దేశాలను వారు చేరుకుంటూ ఉన్నారు. ఇక బీదాబిక్కి గల్ఫ్ దేశాలకు కూలి పనుల కోసం వెళ్లడం కూడా అక్కడ చాలా రొటీన్. ఇక పాక్ కు ఉన్న అప్పులు అన్నీ ఇన్నీ కావు! విదేశీ మారకద్రవ్యం విషయంలో పాక్ ధీన స్థితిలో ఉంది. అంతో ఇంతో చ్కెనా అప్పులు ఇస్తూ తన ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇండియాతో పాక్ యుద్ధం చేయాల్సి వస్తే రోజుల వ్యవధిలో దాని ఆర్థిక పరిస్థితి మరింత చితికిపోతుందనడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు! అయినా.. పాక్ దాష్టీకాలు అయితే ఎక్కడా ఆగడం లేదు. ఉగ్రవాదాన్ని ప్రేరేపించడానికి ఏ మాత్రం వెనుకాడటం లేదు. ఆఖరికి పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం కశ్మీర్ లో టూరిస్టుల మీద విరుచుకుపడటం వరకూ వచ్చింది వ్యవహారం. ఇదంతా జాఫర్ ఎక్స్



ప్రెస్ ట్రైన్ హైజాక్ కు ప్రతీకారం అన్నట్టుగా పాక్ నుంచి కొన్ని స్పందనలు ఉండటం గమనార్హం.

దాదాపు నెలన్నర కిందట పాక్ లోనే భాగమైన బలూచిస్తాన్ ప్రాంతంలో జాఫర్ ఎక్స్ ప్రెస్ ట్రైన్ హైజాక్ అయ్యింది. దాదాపు నాలుగు వందల మందితో ప్రయాణిస్తున్న ఆ ట్రైన్ ను బలూచ్ లిబరేషన్ ఆర్మీ అనే సంస్థ హైజాక్ చేసింది. దాన్ని విడిపించుకోవడానికి పాక్ నానా తంటాలు పడిరది. ప్రయాణికులను తాము విడిపించుకున్నట్టుగా పాక్ ప్రకటించింది. అయితే అది ఉత్తుత్తి మాట అని, ఆ ట్రైన్ లో ప్రయాణిస్తున్న ఐఎస్ఐ వ్యక్తులను బీఎల్ఏ కాల్చిచంపినట్టుగా ప్రచారం జరిగింది. ఆ సంస్థ ఆ ప్రచారం చేసుకుంది.

మరి బీఎల్ఏ పనికి భారత్ పై ప్రతీకారం ఎందుకు అంటే.. బీఎల్ఏ వెనుక ఇండియా ఉందనే ఆరోపణను గతంలో పాక్ చేసింది. ట్రైన్ హైజాక్ సమయంలో పెద్దగా ఈ ఆరోపణ చేయలేదు కానీ, పెహల్ గావ్ అటాక్ కు బీజాలు జాఫర్ ఎక్స్ ప్రెస్ వద్ద పడినట్టుగా ఒక విశ్లేషణ వినిపిస్తూ ఉంది. వాస్తవానికి పాక్ ఆగడాలను ఎదుర్కొనడానికి ఏ రోజు అయినా ఇండియా రెడీగా ఉండాల్సింది. బలూచ్ పరిణామాలతోనో, పాక్ లోని ఇతర వ్యవహారాలతో సంబంధం లేకుండా పాక్ ఆగడాలను తిప్పి కొట్టేందుకు ఇండియా సర్వత్రా సిద్ధంగా ఉండాల్సింది. అయితే పెహల్ గావ్ లో దారుణం చోటు చేసుకుంది. పాక్ ఎప్పుడో ఒక ఫెయిల్డ్ నేషన్ గా నిలిచినట్టే. పాలన పరంగా కానీ, ప్రగతి పరంగా కానీ పాక్ ఎనిమిది దశాబ్దాలు కావొస్తున్నా ఏ రకంగానూ పురోగతిని చాటుకోలేకపోయింది. ఇండియాపై ఉగ్రవాదాన్ని పెంచి పోషించడంలో తప్ప పాక్ ఎక్కడా దృష్టి పెట్టలేకపోయింది. ప్రత్యేకించి గత మూడు దశాబ్దాల్లో.. పాక్ మరింత వెనుకాబాటు తనం దిశగా సాగుతోంది. రోజురోజుకూ అక్కడ పరిస్థితులు దయనీయంగానే మారుతూ ఉన్నాయి. ఇలాంటి స్థితిలో కూడా పాక్ పాలకుల వైఖరి మాత్రం ఇండియా మీద అక్కసు మీదే ఉండటం విచారకరం!

పెహల్ గావ్ ఘటన తర్వాత ఇండియా తీసుకున్న నిర్ణయాలతో పాక్ మరింత ఇబ్బందులు పడవచ్చని అంటున్నారు. నీటి ఒప్పందం నుంచి బయటకు రావడంతో.. ఇప్పటికిప్పుడు కాకపోయినా.. భవిష్యత్తులో పాక్ కు నీటి ఇబ్బందులు తప్పవు. అలాగే ఇండియా ఎగుమతులను ఆపివేయడం తో ప్రత్యేకించి ఫార్మాసూటికల్స్ విషయంలో పాక్ కు గట్టి ఇబ్బంది ఎదురవుతుందనే అభిప్రాయాలు వినిపిస్తూ ఉన్నాయి.

ఇప్పుడు ఇండియా పాక్ పై సైనిక చర్యలను చేపడితే.. ఆర్థికంగా పాక్ మరింత పతనావస్థ కు చేరుకుంటుంది కూడా. ఇండియా సైనిక చర్యలకు చేపడితే వాటిని ఎదుర్కొనడానికి పాక్ డబ్బును ఖర్చు పెట్టాల్సి వస్తుంది. దీంతో.. ఆర్థిక పరిస్థితి అతలాకుతలం అయ్యే అవకాశం ఉంది. పాక్ కు ఆదినుంచి సాయంగా ఉంటున్న ఎమిరేట్స్ దేశాలు కూడా పాక్ లో పరిణామాలతో ఆలోచించే పరిస్థితి ఏర్పడిరది. సీపెక్ విషయంలో చ్కెనా పెట్టుబడులు కూడా ఇప్పటికే ఆగిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నా పాక్ ధోరణి మాత్రం అణువంత్కెనా మారకపోవడం గమనార్హం.

# పాక్ లో అసంతృప్తి పీక్ లో..!

మొన్నటి దాడులు పాకిస్తాన్లోని ఉగ్రవాద శిబిరాలపైనే జరిగాయో..పాక్ ఆక్రమిత కాశ్మీర్లోని తీవ్రవాద ప్రాంతాలపైనే జరిగాయో..

పాకిస్తాన్ ప్రభుత్వం చెబుతున్నట్లు ఆ దేశంలోని నివాస ప్రాంతాలపై(?)
జరిగాయో..

ఒకటి మాత్రం పక్కా..
ఇకపై పాకిస్తాన్ ప్రజలను
ప్రతి ఉదయం
బాంబుల మోతలేబిలి
నిద్రలేపనున్నాయి.
ఇప్పటికే ఆ దేశ ప్రజలకు, పాలకులకు నిద్రలేని రాత్రులు మొదలయ్యాయి.

ఏ సమయంలో తమ ఇళ్లపై
బాంబుల వర్షం కురిసి
తమ ప్రాణాలు నిశీధిలో..
కుటుంబం అంతా ఒక్క చోటే పడుకున్నా గాని
ఒకరికి తెలియకుండా ఒకరు చనిపోతామనే ఆందోళనతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

ఆ భయం మొన్న మంగళవారంతో పరాకాష్టకు చేరుకుంది.తమకు ప్రత్యక్షంగా..పరోక్షంగా ప్రమేయం ఉన్నా లేకున్నా..
దశాబ్దాల తరబడి
తమ పాలకులు అనుసరిస్తున్న భారత వ్యతిరేక వైఖరి ఈరోజున..ఇలా తమ పాలిట సింహస్వప్నంగా పరిణమించిందని పాకిస్తాన్ ప్రజలు గ్రహించడానికి ఎంతో సమయం పట్టలేదు.పెహల్గాన్ ఉగ్రదాడి తర్వాత భారత్ ప్రతీకార చర్యకు దిగుతుందని..ఫలితం తీవ్రంగా
ఉండబోతోందని పాకిస్తాన్లో ప్రతి పౌరునికి తెలుసు.అంతేకాదు..
తమ ప్రభుత్వం ఎంతగా బీరాలు పలికినా తమ దేశ సైనిక బలం భారతదేశ సైనిక సంపద ముందు ఎందుకూ కొరగాదని కూడా పాకిస్తాన్ ప్రజలకు బాగా ఎరుక..!
పౌరుల మనస్తత్వం ఇలా ఉండగా ఇవేవీ పట్టని పాకిస్తాన్ పాలకులు ప్రపంచదేశాల మాటలను కూడా పెడచెవిన పెట్టి కాశ్మీర్ విషయంలో..
ఆ అంశమే ప్రధానంగా ఇండియాతో చెలిమి విషయంలో అనవసర ప్రతిష్ఠలకు..అత్యాశకు పోయి
మొదటి నుంచి కొరివితో తల గోక్కుంటూనే వస్తున్నారు.ఇది తలకి మించిన భారమని
ఆ దేశ పెద్దలకు తెలియక కాదు.అత్యంత శక్తిమంతమైన భారతదేశానికి ఎదురెళ్లి ఇప్పటికే ఎన్నో చావు దెబ్బలను చవిచూసిన అనుభవం పాకిస్తాన్ కు ఉంది.
అయినా బుద్ధి మారని దాయాది ఇండియాని ఎదుర్కోడానికి అందుబాటులో ఉన్న..లేని ఎన్నో మార్గాలను ఎన్నుకుంది.
వాటిలో ప్రధానమైనది భారతదేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం.
ప్రపంచంలోని ఉగ్రవాద సంస్థలు ఎన్నిటినో ఎంచి..ఏరి తమ దేశంలో ఆశ్రయం ఇవ్వటమే గాక శిక్షణా శిబిరాలను కూడా నిర్వహించి అవకాశం దొరికినప్పుడల్లా భారత్ పై దాడులకు ఉసిగొల్పడాన్ని పాకిస్తాన్ ఒక పనిగా పెట్టుకుంది.నిజానికి ఈ విషయంలో పాకిస్తాన్ పాలకులు తమ దేశ పౌరులకు తీరని అన్యాయం చేస్తూ వస్తున్నారు. ప్రజలపై.. వారి అవసరాలపై..సౌకర్యాలపై ఖర్చు చేయాల్సిన సొమ్మును ఉగ్రవాదులపై.. వారిని మేపడంపై ఖర్చు చేసి దేశ ఆర్థిక వ్యవస్థను భ్రష్టుపట్టించారు. ఫలితంగా పాకిస్తాన్లో తీవ్ర ఆర్థిక సంక్షోభ పరిస్థితులు తలెత్తి ప్రజల్లో కనీవినీ ఎరుగని అసంతృప్తి నెలకొంది.ప్రజల్లో ప్రభుత్వం పట్ల భయంకరమైన అసంతృప్తి ఏర్పడి ఉంది.
సామాన్య పౌరులు తిండి కోసం అల్లాడుతున్న పరిస్థితుల్లో పాకిస్తాన్ ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టి ఉగ్రవాదులకు ఖరీదైన మాంసాహారం పెడుతూ ఉండడం గమనించదగ్గ విషయం.
ఇప్పుడు తాజా పరిణామాల్లో కూడా పాకిస్తాన్ ప్రజల్లో
కొంత మేర అభిప్రాయ బేధాలున్నట్టుగా తెలుస్తోంది.
యుద్ధం పట్ల ఆ దేశ ప్రజల్లో
కొందరు సుముఖంగా లేరు.
దీనికి కారణం భారతదేశంపై
ప్రేమ కాదు..తమ బ్రతుకులు
ఏమవుతాయోనన్న ఆందోళన.

ఇండియాతో తలపడే శక్తి పాకిస్తాన్ కు లేదు.పాక్ దుర్బుద్ధి కారణంగా ప్రపంచ దేశాల మద్దతు కూడా ప్రధానంగా ఇండియాకే లభించే అవకాశాలు జాస్తి.ఫలితంగా పాకిస్తాన్ ఓటమి పాలైతే తమ భవిష్యత్తు ఏమిటన్నది పాకిస్తాన్ ప్రజల ప్రధాన ఆందోళన.
ఇప్పుడున్న పరిస్థితుల్లో భారత్ పై యుద్ధంలో గెలుపొందడం మాట అటుంచితే పాక్ ప్రజల్లోని ఈ అభిప్రాయబేధాలు ఆ దేశ విభజనకు దారి తీసినా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు.

**– ఎలిశెట్టి సురేష్ కుమార్,**
**జర్నలిస్ట్ (9948546286)**

# భారత్ - పాక్ మధ్య అందమైన లోయ హుంజా





ప్రస్తుతం భారత్–పాక్ ల మధ్య యుద్ధం జరుగుతున్నది. కానీ భారత్ పాక్ మధ్య ఉన్న కొన్ని అందమైన ప్రదేశాలున్నాయి వున్నాయి. వాటిని తెలుసుకుందాం. భారతదేశంలో అనేక అందమైన ప్రదేశాలున్నాయి. వాటిల్లో పర్యటించడం ఓ అందమైన అనుభవాన్ని ఇస్తాయి. మన దేశంలోని చాలా



ప్రదేశాలు స్వర్గం కంటే తక్కువ కాదు. అదే సమయంలో కొన్ని ప్రాంతాలు వాటి ప్రత్యేకమైన జీవనశ్కెలితో కూడా ప్రసిద్ధి చెందాయి. వీటిలో ఒకటి హుంజా లోయ.

**మాయా జలం నీటిని చూసారా?:**

హుంజా లోయలోని హిమానీనదం నుంచి ప్రవహించే నీటిని స్థానిక ప్రజలు మాయా జలంగా భావిస్తారు. శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో సహాయపడే ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఇందులో పుష్కలంగా ఉన్నాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. హుంజా లోయలోని మహిళలు వారి అందంతో ప్రసిద్ధి చెందారు. హుంజా లోయలోని మహిళలు 65 సంవత్సరాల వయస్సులో కూడా యవ్వనంగా, అందంగా కనిపిస్తారని చెబుతారు. ఇక్కడి మహిళలు యవ్వనంగా కనిపించడమే కాదు చాలా చురుగ్గా ఉంటారు, వారు 65 సంవత్సరాల వయస్సులో కూడా బిడ్డకు జన్మనివ్వగలరు. ఇక్కడ పండే ఆప్రికాట్లు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. స్థానిక ప్రజలు వీటియిన్ ఎండబెట్టి ఏడాది పొడవునా తింటారు. ఆప్రికాట్ల గింజల నుంచి నూనెను కూడా తీస్తారు, ఇది చర్మానికి చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది.

## చరిత్రలో ఈ రోజు (మే 10)

**సంఘటనలు:**

1267: అందరూ యూదులను గుర్తించటానికి వీలుగా ప్రత్యేకమైన దుస్తులను ధరించాలని వియెన్నా లోని చర్చి ఆదేశం.

1278: ఇంగ్లాండ్ లోని యూదులను చెరసాలలో బంధించారు.

1427: స్విట్జర్లాండ్ లోని బెర్న్ నుంచి యూదులను బహిష్కరించారు.

1497: ఇటాలియన్ నేవిగేటర్ అమెరిగో వెస్పుస్సి నూతన ప్రపంచాన్ని కనుగొనటానికి తన మొదటి యాత్రను మొదలు పెట్టాడు.

1857: ఢిల్లీ దగ్గర ఉన్న మీరట్‌కాజెర్న్ సిపాయిల తిరుగుబాటుతో మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం మొదల్కెన రోజు.

1857: భారత స్వాతంత్ర్యోద్యమము: 10వ 11వ, 20వ అశ్వదళం సమావేశమై అధికారులను ధిక్కరించి 3వ పటాలాన్ని విడిపించారు. మే 11న ఇతర భారతీయులతో కలిసి సిపాయిలు ఢిల్లీ చేరుకొని చివరి మొగలు చక్రవర్తి బహదూర్‌షా 2 నివాసమైన ఎర్రకోటని ఆక్రమించి చక్రవర్తిని ఢిల్లీసుల్తాన్ గా తిరిగి అధికారాన్ని స్వీకరించాల్సిందిగా వత్తిడి చేసారు. బహదూర్‌షా మొదట అంగీకరించకపోయినా, తరువాత ఒప్పుకొని తిరుగుబాటుకు నాయకత్వాన్ని వహించాడు.

1908: మదర్స్ డే మొట్ట మొదటి సారిగా అమెరికా లోని పడమటి వర్జీనియా లోని గ్రాఫ్టన్ అనే వూరిలో జరిగింది..

1930: అమెరికా లో, మొదటి ప్లానెటోరియం (నక్షత్ర శాల) ను చికాగో లోని, ఆడ్లెర్ నగరంలో ప్రారంభించారు.

1933: నాజీలు జర్మనీలో బహిరంగంగా పెద్ద ఎత్తున పుస్తకాలను తగులబెట్టారు.

1940: చర్చిల్ ఇంగ్లాండు ప్రధానమంత్రి పదవిని చేపట్టాడు.

1950: నెదర్లాండ్ నుంచి అమెరికాకు మొదటి టెలెక్సు పంపారు.

1960: అమెరికాకు చెందిన అణు జలాంతర్గామి ట్రైటన్ తన 84 రోజుల సుదీర్ఘమైనటువంటి, నీటి లోపల ప్రయాణం, విజయవంతంగా ముగించింది.

1963: పోప్ జాన్ బల్జాన్ శాంతి బహుమతి పొందాడు. ఇప్పటివరకు ఒక పోప్ (క్రైస్తవ మతాధిపతి) కి ప్రదానం చేసిన మొదటి శాంతి బహుమతి ఇదే

1964: జాంబియా దేశపు అధ్యక్షుడుగా కెన్నెత్ కౌండా అధికారం చేపట్టాడు.

1967: అమెరికా అణుబాంబును నెవడా అనే చోట పేల్చి పరీక్షించింది.

1969: అపోలో–10 వ్యోమ నౌక, రోదసీ నుంచి భూమి ఎలా కనిపిస్తోందో చూసి, మొట్టమొదటి సారిగా, రంగుల చిత్రాలను, తీసి పంపింది.

1972: అమెరికా అణుబాంబును నెవడా అనే చోట పేల్చి పరీక్షించింది.

1976: బ్రిటిష్ రాణి లండన్ లోని నేషనల్ థియేటర్ని ప్రారంభించింది.

1983: అమెరికా సంయుక్త దళాలు గ్రెనడా పై దాడి చేసాయి .

1984: ఇథియోపియాకి అత్యవసర సహాయంగా ఐరోపా ఉదారంగా సహాయం చేసింది.

నెల్సన్ మండేలా

1994: నెల్సన్ మండేలా దక్షిణ ఆఫ్రికా మొట్ట మొదటి నల్లజాతి అధ్యక్షునిగా ప్రమాణస్వీకారం .

2001: బ్రిటన్ లో గత 20 సంవత్సరాలు కన్నా తక్కువ క్రైమ్ రేట్లు నమోదు.

2002: భారత లోక్‌సభ సభాపతిగా మనోహర్ జోషి పదవీ స్వీకారం.

2005: గూగుల్ వార్తలు, శోధన పద్ధతి కొరకు పేటెంట్ అడిగింది. అందువలన నాణ్యత గలిగిన వార్తల వెబ్ సైట్ల లింకులు దొరికాయి.

2006: ట్కెటానిక్ నౌక ప్రమాదంలో బతికి బట్ట కట్టిన, చివరి అమెరికా పౌరుడు మరణించాడు.

2006: సెక్స్ వెబ్ సైట్లకు .%% డొమైన్ పేరు తగిలించాలన్న విన్నపాన్ని ఐ.సి.ఎ.ఎన్.ఎన్ %%×%జ%ూ%చీచీ% తిరస్కరించింది.

2007: మొదటి ప్రపంచయుద్ధంలో బతికి బట్ట కట్టిన ఒకే ఒక్క వీరుడు కెనడాలో ఇంకా బతికి ఉన్నాడు.

2010: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో, లేండ్ మైన్ (భూమి లోపల పాతిన బాంబు) పేలి, ఎనిమిది మంది మరణించారు.

2010: రష్యా తన విజయ దినాన్ని జరుపుకుంది.

2011: పరువు హత్యలలో (పరువు, మర్యాద లేదని, అవి హత్యలేనని భారతదేశపు న్యాయ స్థానం వెల్లడిరచింది.

2004: ప్రపంచ లూపస్ దినం

**జననాలు:**

1661: జహందర్ షా, మొఘల్ చక్రవర్తి.

1855: శ్రీయుక్తేశ్వర్ గిరి – ఆధ్యాత్మిక గురువు. ది హోలీ సైన్స్ రచయిత.

1922: కొంగ్రపాటి గంగాధరరావు, నటుడు, దర్శకుడు, శతాధిక నాటకకర్త, కళావని సమాజ స్థాపకుడు.

1978: ఉపద్రష్ట సునీత, గాయని, డబ్బింగ్ కళాకారిణి.

1980: నమిత, తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, చిత్రాల నటి .

1986: పెంటేల హరికృష్ణ, ఆంధ్రప్రదేశ్ కు చెందిన చదరంగం క్రీడాకారుడు.

1906: భగవత్ సాహు భారత స్వాతంత్ర్య సమర యోధుడు.

1980: నమిత, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, చిత్రాల నటి .

**మరణాలు:**

1787: విలియం వాట్సన్, ఇంగ్లీషు భౌతిక శాస్త్రవేత్త.

1936: పినపాల వెంకటదాసు, తెలుగు సినిమా పంపిణీదారుడు, తొలి తెలుగు స్టూడియో అధినేత, సినీ నిర్మాత.

1992: కె.జి.రామనాథన్, ప్రముఖ భారతీయ గణిత శాస్త్రవేత్త.

2021: టీఎన్ఆర్, తెలుగు ఇంటర్వ్యూ హోస్ట్, సినిమా జర్నలిస్టు, నటుడు.

## పంచాంగం

**శనివారం 10-5-2025**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరము**
**ఉత్తరాణాయణం, వసంత రుతువు**
**వైశాఖ మాసం**

| | |
|---|---|
| తిథి | : శు. త్రయోదశి సా. 5.30 |
| నక్షత్రం | : చిత్త రా. 3.15 |
| వర్జ్యం | : ప. 9.11 ల 11.01 |

# గంట్లకు విశ్వ దాత పురస్కారం ప్రధానం

- ఆదర్శనీయం..కాశీ నాధుని నాగేశ్వరరావు పంతులు దాతృత్వం
- కృష్ణ యూనివర్సిటీ వీసీ కూన రాంజీ,
- పామర్రు ఎమ్మెల్యే కుమారరాజా



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు దాతృత్వం, త్యాగం, దేశభక్తి నేటి తరానికి ఆదర్శనీయమని కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కూన రాంజీ అన్నారు. కృష్ణా జిల్లా పామర్రు మండలం, ఎలకుర్రులో విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ స్థాయి విశ్వదాత అవార్డును విశాఖపట్నంకు చెందిన సీనియర్ పాత్రికేయులు, జాతీయ జర్నలిస్ట్ ల సంఘం కార్యదర్శి, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు గంట్ల శ్రీనుబాబు కు వీసీ రాంజీ, పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార రాజాలు చేతులు మీదుగా ప్రధానము చేసారు. వేద మంత్రాల నడుమ ఘనంగా సత్కరించి విశ్వ దాత అవార్డును, నగదు ప్రోత్సాహం అందించారు.. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా వీసీ కూన రాంజీ,

ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా లు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమకాలంలో కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గాంధీజీ అడుగు జాడలో నడిచారన్నారు. వందేళ్ల క్రింద శ్యామల పాఠశాల ఏర్పాటు చేసి అందరికి విద్య అందించారన్నారు.. అలాగే అమృతాంజన్ సృష్టి కర్తగా, ఆంధ్ర పత్రిక వ్యవస్థాపకులుగా స్వాతంత్ర పోరాటం లో నాగేశ్వరరావు ఎంత గానో సేవలు అందించారని కొనియాడారు.. సేవా గుణాన్ని పుణికిపుచ్చుకున్న వారి వంశీయులు నేడు మానసిక దివ్యాంగుల కోసం కేడీబీ ట్రస్టుని ఏర్పాటు చేసి ఉచితంగా విద్య, వైద్య సౌకర్యాలు అందించడంతోపాటు పలు వృత్తి విద్యాకోర్సుల్లో ఎంతో మందికి శిక్షణ ఇస్తున్నారని కొనియాడారు..అదే కుటుంబానికి చెందిన విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు కాశీ నాధుని నాగేశ్వరరావు మాట్లాడుతూ అంతటి మహోన్నత వ్యక్తి పేరిట ప్రతీ ఏటా విశ్వ దాత అవార్డు అందిస్తున్నామన్నారు... ఈ అవార్డును ఇప్పటి వరకు ఎంతో మంది ప్రముఖులు కు అందించామని ఈ ఏడాది జర్నలిజం, సేవా రంగము లో విశాఖపట్నం జిల్లా సింహాచలం గ్రామం కు చెందిన గంట్ల శ్రీనుబాబు కు ఈ అవార్డు ను ప్రధానము చేయడం సంతోషం కలిగిస్తుంది అన్నారు.అవార్డు స్వీకరించిన అనంతరం గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ కాశీ నాధుని నాగేశ్వరరావు పంతులు అవార్డు తాను స్వీకరించడం పూర్వ జన్మ సుకృతం గా భావిస్తున్నట్లు చెప్పారు..స్వాతంత్ర పోరాటములో గాంధీ తో కలిసి తన వంతు పాత్ర పోశించిన నాగేశ్వరరావు నేటి తరాలకు ఆదర్శనీయులు అన్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డు లు కంటే కాశీ నాధుని నాగేశ్వర రావు పంతులు పురస్కారం తనకు ఎంతో ప్రత్యేకమన్నారు..విద్యా, వైద్య రంగాల్లో ఎంతో పేరు ప్రతిష్ట పొందిన నాగేశ్వరరావు నేటి తరము కు ఆదర్శ నీయులు అని కొనియాడారు..అంతకు ముందు కేడీబీ దివ్యాంగుల పాఠశాల, శ్యామల ప్రాధమిక పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆలరించాయి. విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ సభ్యులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీ నారాయణ వేదాంతం పార్ధ సారధి, ముదిగొండ రవి కుమార్, శివ లెంక ఉషా కిరణ్, ఎం ఎన్ వి ప్రసాద్ లు గౌరవ అతిధులు గా హాజారయ్యారు.. కార్యక్రమం సమన్వయకర్త గా ముదిగొండ శాస్త్రి తదితరులు అంతా కార్యక్రమం లో పాల్గొన్నారు.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**
**టెండరు కోరుతూ ప్రకటన**
టెండరు నం. 30255531, తేది:06.05.2025
పని పేరు: 13.06.2024 లేదా తాజాగా జారీ చేయబడిన RDSO స్పెషిఫికేషన్ నం. RDSO/2017/EL/SPEC/0134 (REV-03) ప్రకారం WAP7/WAG9 రకం మూడు ఫేజ్ ఎలక్ట్రిక్ లోకోమోటివ్ కొరకు ట్విన్ బీమ్ LED హెడ్‌లైట్. గమనిక: ప్రతి సెట్ 02 యూనిట్లు కలిగి ఉండవలెను. (వారంటీ కాలం: డెలివరీ తేదీ నుండి 60 నెలలు)
పరిమాణం: 320 సెట్లు
గమనిక: మెటీరియల్ 120 రోజుల్లో సరఫరా చేయాలి.
టెండరు తెరుచు తేది & సమయం: 29.05.2025న 15.00 గం.లకు.
TPI ఏజెన్సీ ద్వారా తనిఖీ
పూర్తి వివరాలు www.ireps.gov.in లో లభించును.
సీనియర్ డివిజనల్ మెటీరియల్ మేనేజర్/ వాల్తేరు
PR-112/Q/25-26

# నర్సీపట్నంలో రూ.10 లక్షల నకిలీ కరెన్సీ పట్టివేత

● ముగ్గురు వ్యక్తుల అరెస్ట్.. ● రైస్ పుల్లింగ్ కాయిన్ పేరుతో మోసం చేస్తున్నట్లు గుర్తింపు.. ● వివరాలు వెల్లడించిన నర్సీపట్నం రూరల్ సీఐ



**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** రైస్ పుల్లింగ్ కాయిన్ పేరుతో ప్రజలను బురిడీ కొట్టిస్తూ, నకిలీ నోట్లతో అమాయకులను వంచిస్తున్న ముగ్గురు వ్యక్తులను నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ ఆధ్వర్యంలో రూరల్ సర్కిల్ పోలీసులు గురువారం అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.10 లక్షల నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎల్ రేవతమ్మ వివరాలు వెల్లడించారు. నర్సీపట్నం డి.ఎస్.పి ఆధ్వర్యంలో రూరల్ సీఐ కు వచ్చిన నమ్మకమైన సమాచారంతో, నర్సీపట్నం రూరల్ ఎస్సై పి రాజారావు, గొలుగొండ ఎస్సై రామారావు మరియు సిబ్బంది స్థానిక నెల్లిమెట్ట జంక్షన్ సమీపంలోని బుచ్చంపేట వైపు వెళ్లే రహదారిలోని రాతి పణుకు వద్ద దాడి నిర్వహించారన్నారు. ఈ దాడి సమయంలో ఆ ప్రదేశంలో ఏపీ 39 ఈ డబ్ల్యు 9681 నంబరు గల సుజుకి సెలెరియో కారు నిలిపి ఉంచి ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారన్నారు. పోలీసులను చూచి అందులో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారని, ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారని సీఐ తెలిపారు. విజయనగరానికి చెందిన నిమ్మల మనోహర్, విజయనగరం వి టి అగ్రహారం కు చెందిన తమ్మినేని సుమంత్ కుమార్, విజయనగరం ప్రదీప్ నగర్ కు చెందిన నిమ్మల మన్మధ లను అరెస్టు చేసి వీరి వద్దనుండి రూ.2 లక్షల 60 వేలు అసలు నోట్లను, రూ 10 లక్షల విలువ గల నకిలీ నోట్లను, ఒక సుజుకి సెలోరియ కారు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం ఈ నకిలీ నోట్లు అమెజాన్ లో చిల్డ్రన్స్ బ్యాంకు పేరుతో ఆర్డర్ చేసి తెప్పించి, వాటిని నిజమైన నోట్లని నమ్మించి, రైస్ పుల్లింగ్ కాయిన్ పేరుతో మోసం చేయడానికి ప్రయత్నించారన్నారు. ఈ ముఠా అమాయక గిరిజనులను లక్ష్యంగా చేసుకొని డబ్బు సంపాదించే లక్ష్యంతో నకిలీ కరెన్సీ ఉపయోగించేందుకు యత్నిస్తున్నట్టు వెల్లడైందన్నారు. పరారైన ఇద్దరు వ్యక్తులపై గతంలోనే కేసులు ఉన్నాయని గుర్తించామని, వీరి కోసం గాలిస్తున్నామని సిఐ తెలిపారు. ఈ రైస్ పుల్లింగ్ కాయిన్ కు మహిమలు ఉన్నాయి అనేది కేవలం భూటకం మాత్రమేనని, కొంత మంది అమాయక ప్రజలు కోట్ల డబ్బులు సంపాదించాలనే దురాశతో ఈరైస్ పుల్లింగ్ కాయిన్ ఉచ్చులో పడుతున్నారని, చివరకు డబ్బులు పోగొట్టుకొని రోడ్డు మీద పడుతున్నారన్నారు. కొంతమంది మోసగాళ్లు అమాయక ప్రజల నమ్మకాన్ని దుర్వినియోగం చేసుకొని, ఈ కాయిన్ లక్షలు - కోట్ల విలువైనదిగా అమ్ముకుంటే ధనవంతులవుతారనే మాయమాటలతో మోసం చేస్తున్నారని, ఈ మాయమాటలకు బలై చాలామంది తమ జీవితంలో కూడబెట్టుకున్న డబ్బును కోల్పోయి రోడ్డున పడ్డ ఉదాహరణలు ఉన్నాయని, ఇలాంటి మోసాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటువంటి సంఘటనలు గాని నేరాలు గాని మీ దృష్టి కి వచ్చినట్లు అయితే అనకాపల్లి జిల్లా పోలీస్ ఎమర్జెన్సీ 112, 100, 1903 నంబర్లకు ఫోన్ చేయవలసిందిగా కోరారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, మరికొంతమందిని అరెస్టు చేసే అవకాశం ఉందని రూరల్ సీఐ రేవతమ్మ వెల్లడించారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్సై పి రాజారావు, గొలుగొండ ఎస్సై రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుంది

## తుని సంస్థాగత ఎన్నికల పరిశీలకులు బుద్ధ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు తుని నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు శుక్రవారం హాజరయ్యారు. తుని నియోజకవర్గ శాసన సభ్యురాలు శాసనసభ విప్ చావలి దివ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు పాల్గొన్నారు సమావేశంలో కీర్తిశేషులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనమైన నివాళులర్పించారు. సమావేశంలో నాగ జగదీష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ గ్రామస్థాయి నుండి మండలం మున్సిపాలిటీ నియోజకవర్గ కస్టర్ కమిటీలు, యూనిట్ బూత్ కమిటీలకు ఈరోజు పార్టీలో ప్రముఖమైన పాత్ర ఉందని ఈ కమిటీల క్ కాలపరిమితి 2025-2027 వరకు సభ్యులు పనిచేయవలసి ఉంటుందని, కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని, రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం ఉంటుందని, కొంతమందికి నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించడానికి శాసన సభ్యురాలు సిఫార్సులు మేరకు పదవులు రానున్నాయని తెలిపారు. వైసిపి అరాచకాలు వలన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాలా తీసిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగా రాష్ట్రానికి పరిశ్రమలతో పాటు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, నిరుద్యోగ సమస్య నిర్మూలనకు యువతకు 20 లక్షలు ఉద్యోగాలు కల్పన దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అమరావతి నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి ఫలితంగా 65 వేల కోట్లు రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని తల్లికి వందనం జూన్ మొదటి వారంలో ఎంతమంది పిల్లలు ఉన్నా 15000 చొప్పున చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని, మే నెలలో అన్నదాత సుఖీభవ ప్రతి రైతుకు 20,000 భూమి ఉన్న ప్రతి వ్యక్తికి డైరెక్ట్ గా వారు ఖాతాలకు వేయడం జరుగుతుందని ఆర్థిక వేత్త శాసనసభ మాజీ స్పీకర్ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు సూచనలో సలహాతో తుని నియోజకవర్గంలో అత్యంత వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, శాసన సభ్యురాలు దివ్య చురుకుగా రాజకీయాల్లో నియోజవర్గ అభివృద్ధి పై ప్రత్యేకమైన దృష్టి పెట్టారని వారి తండ్రి రామకృష్ణుడు అనుభవంతో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, వైసిపి నాయకుల దుష్ప్రచారాలను కార్యకర్తలు నాయకులు ఎప్పటికప్పుడు పత్రికల్లో సోషల్ మీడియాలో తిప్పి కొట్టాలని పార్టీ శ్రేణులకు నాగ జగదీష్ పిలుపునిచ్చారు.


# అన్నదాత సుఖీభవ పథకం

## అర్హత కలిగిన రైతులందయా ఇకెవైసీ చేయించుకోవాలి
## జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** రాష్ట్రంలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతులందరికి పెట్టుబడి సాయం క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పి.ఎం. కిసాన్ పథకం ద్వారా సంవత్సరానికి 20వేల రూపాయలు రైతు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు తెలిపారు. ఈ పథకం ముందుగా గ్రామంలో ఉన్న రైతు సేవ కేంద్రం సిబ్బంది ఆన్లైన్లో ఉన్న రైతుల సమాచారాన్ని తనిఖీ చేసి ఆమోదిస్తారని తెలిపారు.రైతు వారి వివరాలన్నీ కూడా సంబంధిత గ్రామస్థాయి రైతు సేవ కేంద్రం వ్యవసాయ నిబ్బంది మరియు రెవిన్యూ శాఖ వారు తనిఖీ చేసి జాబితాను తయారు చేసిన పిదప అర్హులైన రైతులందరు ఈకెవైసి చేయించుకోవాలని తెలిపారు. వ్యవసాయం చేస్తున్న చిన్న, సన్న కారు, మధ్యస్థ, పెద్ద రైతులకు అందరికి కూడా ఈ పథకం వర్తిస్తుందని, ఈ సమాచారం అంతా కూడా గ్రామస్థాయిలో ఉన్న రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది తనిఖీ చేసి మే నెల 20వ తేది లోపు అన్నదాత సుఖీభవ ఆన్లైన్ పోర్టల్ లో ధృవీకరణ కొరకు ఆదేశించడం జరిగినదన్నారు.దీని కొరకు తాహసీల్దారులకు, మండల వ్యవసాయ అధికారులకు మరియు రైతు సేవా కేంద్రం సిబ్బందికి లాగిన్ లు ఇవ్వడం జరిగినదని,కావున రైతులందరూ కూడా గ్రామస్థాయి అధికారులకు సహకరించవల సిందిగా కోరుచున్నామని,ఈ అవకాశాన్ని రైతులు అందరు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.ఈ పథకానికి నిబంధనలు ప్రకారం ఒక రైతు కుటుంబం అనగా భర్త భార్య పిల్లలు ఒక యూనిట్ గా పరిగణించబడతారని, ఒకే కుటుంబానికి చెందిన వారు ఉమ్మడి భూములు కలిగి ఉంటే వారిలో ఎక్కువ విస్తీర్ణం కలిగి ఉన్న వారి బ్యాంకు ఖాతాకు నిధులు విడుదల కాబడతాయన్నారు.ఒక వేళ ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములకు సమాన శాతం భూమి వాటా ఉంటే కనుక ఎవరైతే ఆ ఇంటికి పెద్దవారి వారి బ్యాంకు ఖాతాకు నిధులు విడుదల కాబడతాయని తెలిపారు. వ్యవసాయ భూమి కలిగి ఉన్న యజమాని లేదా కౌలు రైతు కార్డు కలిగి ఉన్న వారికి కూడా నిధులు వారి వారి బ్యాంకు ఖాతాలకు విడుదల కాబడతాయన్ని వ్యవసాయ భూమి అనగా వ్యవసాయ/ ఉద్యాన/పట్టు పరిశ్రమకు సంబంధించిన పంటలు సాగుచేస్తున్న రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు.ఈ పథకానికి మరణించిన వారు,రాజ్యసభలో గాని శాసనసభలో గాని జిల్లా పరిషత్ లో గాని మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రస్తుతం కానీ గతంలో కానీ పదవులు చేపట్టి ఉన్న వారు,అలాగే ప్రస్తుతం కానీ గతంలో గాని ఎమ్మెల్యేలు గాను ఎంపిలు గాను పదవులు చేపట్టినవారు,నెలకు పదివేలు లేదా పదివేలు కంటే ఎక్కువ దాటి పెన్షన్ తీసుకుంటున్న వారు,పని చేస్తున్న మరియు రిటైరైన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు (నాల్గవ తరగతి మరియు క్రింది స్థాయి ఉద్యోగుల కు మినహాయింపు),గత సంవత్సరం ఆదాయపు పన్ను కట్టిన వారు,డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, చార్టెడ్ అకౌంటెంట్లు,రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్న వారు,తమ భూమిని వ్యవసాయం కాకుండా ఇతర ప్రయోజనాలకు ఉపయోగించిన వారు (అనగా ఇళ్ల స్థలాలకు గాని చేపల పెంపకానికి గాని), కుటుంబ సర్వే లో పేరు లేకుండ ఇక్కడ భూమి కలిగి ఉండి వేరే రాష్ట్రం లో నివాసం ఉంటున్న వారు అనర్హులు అని తెలిపారు.

# ఆనకట్ట మరమ్మతులకు విశాఖ డైరీ చేయూత

● అన్నదాతలకు అండగా విశాఖ డైరీ ట్రస్ట్.... ● ఏడు గ్రామాలకు చెందిన సుమారు 3,500 ఎకరాలకు సాగునీరే లక్ష్యం.... ● నాలుగు లక్షల రూపాయల చెక్కు అందజేసిన విశాఖ డైరీ చైర్మన్ ఆనందబాబు ● ఐదేళ్ల నుంచి పునర్నిర్మాణానికి నోచుకోని మంగళాపురం ఛానెల్‌కు విశాఖ డైరీ ట్రస్టు సహకారంతో మరమ్మత్తులు



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** దాదాపు మూడున్నర వేల ఎకరాలకు సాగు నీరు అందించే మంగళాపురం ఆనకట్ట మరమ్మత్తు పనులకు విశాఖ డైరీ ట్రస్ట్ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ చేతుల మీదుగా నాలుగు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో నాయకుల వాగ్దానాలు హామీలకే పరిమితం కావడంతో ఐదేళ్ల నుంచి రైతులు ఇబ్బంది పడుతున్నారని వర్షంపై ఆధారపడాల్సి రావడంతో పంటల సాగు దైవాదీనంగా మారిందని ఆనకట్ట కిందనున్న కుముందాంపేట, విజయరామరాజుపేట, మంగళాపురంబీ చీడికాడ మండలం దండిసురవరం, దిబ్బపాలెంబీ చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామాల పరిధిలో సుమారు 3,500 ఎకరాల ఆయకట్టు వుంది. కోనాం జలాశయం నుంచి ఈ ఆనకట్టకు నీరు చేరుతుంది. ఈ ఆనకట్ట కింద 2018లో సంభవించిన వరదలకు ఆనకట్ట కొట్టుకుపోయింది. దీంతో పంట కాలువకు నీరు ప్రవహించక, రిజర్వాయర్ నుంచి వచ్చిన నీరు వచ్చినట్టు దిగువకు వెళ్లిపోతున్నది. ఆనకట్టను పునర్నిర్మించాలని రైతులు పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేశారు. అయినా స్పందన లేకపోవడంతో 2019లో రైతులు చందాలు వేసుకుని తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. రెండేళ్లపాటు పొలాలకు బాగానే నీరందింది. మళ్లీ 2021 సెప్టెంబరులో భారీ వర్షాలు కురిసి, వరద ఉధృతంగా ప్రవహించడంతో ఆనకట్ట కొట్టుకుపోయింది. సాగునీటి కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. ఆనకట్టను పునర్నిర్మించాలని ప్రజాప్రతినిధులకు, ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అదే ఏడాది డిసెంబరులో ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఆనకట్టను పరిశీలించి, పునర్నిర్మాణ పనులు చేపడతామని, 2022 ఖరీఫ్‌నాటికి ఆయకట్టుకు నీరందిస్తామని చెప్పారు. కానీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో అధికారులు చేతులెత్తేయడంతో అసంపూర్తిగా నిలిచిపోయిన మంగళాపురం ఆనకట్ట గ్రోయన్ కింద ఉన్న రైతుల సమస్యను తెలుసుకున్న విశాఖ డైరీ చైర్మన్ ఆనందబాబు గతవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి ట్రస్టు ద్వారా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.దానిలో భాగంగా డైరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ చేతుల మీదుగా విజయరామరాజుపేట మాజీ సర్పంచ్ దొడ్డి కిషోర్ కు నాలుగు లక్షల రూపాయల చెక్కును అందజేసి వెంటనే పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు.

# ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రిలో టెక్నిషియన్‌ల కొరత

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రిలో ఉన్న ల్యాబ్ లో రక్తపరీక్షలు మరియు యూరిన్ పరీక్షల కొరకు ఒక ల్యాబ్ టెక్నిషియన్ అతనికి సహాయంగా ఒక అసిస్టెంట్ ఇద్దరు , ఇందులో ల్యాబ్ అసిస్టెంట్ గత సంవత్సరం జూన్ 30 వ తేదని ఉద్యోగ విరమణ జరిగింది. అప్పటి నుండి ఇంత వరకు మరొక అసిస్టెంట్ లేక ల్యాబ్ టెక్నిషియన్ ఒక్కరితో వచ్చిన రోగులకు పరీక్షల నిర్ధారణ జరుపుతున్నారు. ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి గరించి అందరికీ తెలిసిందే ఇక్కడ ప్రసూతి చేయించుకుంటే కచ్చితంగా తల్లి పిల్ల ఇద్దరు క్షేమంగా ఉంటారు అనేది అందరి నమ్మకం అందువలన జిల్లాలోనే కాకుండా ప్రక్క జిల్లాల నుండి కూడా ఇక్కడికి వచ్చి క్షేమంగా ఇంటికి చేరుకుంటున్నారు. ఆసుపత్రి కి రోజు రోజుకు రోగుల సంఖ్య పేరుగుతుండం పరీక్షలు నిర్వహించేందుకు కొంత సమయం పడుతుంది దీని వలన వైద్య అందించేడమ్ లో కొంత వ్యవది పడుతుంది అని అక్కడి వచ్చిన రొగులు

తమ గొడును వెల్లడించుకుంటున్నారు.మరో వైపు పిల్లల డాక్టర్ ఆసుపత్రి లేక పోవడం తో పుట్టిన పిల్లలు కొందరు చ్చిన్నపట్టి




అనారోగ్యంతో జన్మించిన చిన్నారులకు ఆసుపత్రిలో సదుపాయాలు ఉన్న సంబాదిత వైద్యుల కొరత వలన సమీపంలో ఉన్న కే. జి.హెచ్ కు తరలించి వైద్యని అందించుతున్నారు అయితే ఇక్కడి నుండి కే. జి.హెచ్ కు తరలించే సమయంలో ట్రాఫిక్ తక్కువ ఉంటే పర్వాలేదు కానీ ట్రాఫిక్ ఎక్కువ ఉంటే మాత్రం కొంచెం ఆలోచించ వాలసిందే అందువలన ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆసుపత్రి కి సరిపడే వైద్యులను అందించి మరింత వైద్య సేవలను అందిస్తారని జిల్లా ప్రజలు వేచిచూస్తున్నారు.

# ఏపీ ఈపీడీసీఎల్ నూతన డైరెక్టర్లకు స్వాగతం పలికిన ఈ బీ సి ఇ డబ్ల్యు అసోసియేషన్ ప్రతినిధులు

**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** ఈస్టర్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ నూతన డైరెక్టర్లుగా పదవీ బాధ్యతలు చేపట్టిన టీ వీ సూర్యప్రకాష్, శ్రీమతి టీ వనజ లను ఎలక్ట్రిసిటీ బ్యాక్ వార్డ్ క్లాసెస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ ఆపరేషన్ డైరెక్టర్ గా టీవీ సూర్యప్రకాష్, ప్రాజెక్ట్ ల డైరెక్టర్ గా టీ వనజ ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులకు ఎప్పటిలాగానే తమ వంతు సహకారాన్ని అందించాలని



యూనియన్ ప్రతినిధులు డైరెక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ డిస్కం కార్యదర్శి సంపంగి రామకృష్ణ, రీజనల్ కార్యదర్శి కె.వి త్రినాధరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

2nd pages11.qxd 5/9/2025 8:01 PM Page 6



## పాకిస్తాన్ తో జరుగుతున్న యుద్ధంలో తెలుగు బిడ్డ మురళీ నాయక్ వీర మరణం

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన అనకాపల్లి ఎం.పీ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** ఆపరేషన్ సిందూర్ లో భాగంగా జమ్మూ కాశ్మీర్ యుద్ధభూమిలో వీరోచితంగా పోరాడుతూ మన తెలుగు బిడ్డ సత్యసాయి జిల్లా కల్లితండాకు చెందిన జవాను మురళీ నాయక్ వీర మరణం పొందడం పట్ల తీవ్ర రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంటు సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.దేశ రక్షణ కోసం ప్రాణాలు విడిచిన మురళీ నాయక్ వీర మరణం తెలుగు ప్రజలకే కాక దేశ ప్రజలందరికీ స్ఫూర్తి దాయకం అని పేర్కొన్నారు.పాకిస్తాన్ తో యుద్ధంలో మురళీ నాయక్ ప్రదర్శించిన ధైర్యసాహసాలకు మన తెలుగు రాష్ట్రాల తరఫున జేజేలు పలికారు.మురళీ నాయక్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడ్ని ప్రార్థిస్తు వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా మురళీ నాయక్ కుటుంబాన్ని ఆదుకుంటుంది అని తెలియజేసారు.

## వెండితో ముస్తాబైన మాడుగుల మోదకొండమ్మ



**వి.మాడుగుల,(విశాఖ సమాచారమ్):** వెండితో మాడుగుల మోదకొండమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి విగ్రహాన్ని వెండి కవచంతో మాడుగుల శాసనసభ్యుడు బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా అలంకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఇలవేల్పు, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా మాడుగుల మోదకొండమ్మకు ఎంతో ప్రఖ్యాతి ఉందని అమ్మవారి చల్లని దీవెనలు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు మాట్లాడుతూ 28 కిలోల వెండి కవచము, 8 తులాల బంగారు శతమానాల నల్లపూసలతో అలంకరణ, వెండి త్రిశూలం నూతనంగా అమ్మవారి కలంకరించామని వీటన్నిటి విలువ సుమారు 40 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే నూతనంగా కళ్యాణ మండపము, ఏసి రూము ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వీటి ప్రారంభాలతో మాడుగుల మోదకొండమ్మ అమ్మ అమ్మవారి ఆలయం మరింత అభివృద్ధిలోనికి వచ్చిందని అప్పలరాజు అన్నారు. అలాగే అమ్మవారి ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని ప్రజల యొక్క సహకారంతో ఘనంగా చేయడానికి నిర్ణయించామని చైర్మన్ అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనాదు శ్రీనివాసరావు( దేవరాపల్లి శ్రీను), దంగేటి సూర్యారావు, భీమరశెట్టి పైడయ్య నాయుడు, ఎంపీపీ టి రాజారామ్, సర్పంచ్ ఎడ్ల కళావతి, అద్దిపల్లి జగ్గారావు, ఢిల్లీ నానాజీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఆపదలో అండగా జనసేన పార్టీ ఉంటుంది

### జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి రాయపురెడ్డి కృష్ణ



**వి.మాడుగుల(విశాఖ సమాచారమ్):** ప్రజలకు ఎప్పుడు జనసేన పార్టీ అండగా ఉంటుందని నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ రాయపరెడ్డి కృష్ణ అన్నారు.

మండలంలోని ఘాట్ రోడ్డు జనసేన పార్టీ కార్యాలయం వద్ద క్రియాశీల సభ్యత్వం నమోదు కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని రాయప్ రెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా సుమారుగా 5200 క్రియాశీల సభ్యత్వ నమోదు చేయడం జరిగిందని అన్నారు. ఒక్క మాడుగుల మండలంలోని 3000 పైగా సభ్యత్వ లు చేయడం జరిగిందన్నారు. ఇంకా మరిన్ని సభ్యత్వాలు నమోదుకు కృషి చేయాలని కోరారు. ఈ సభ్యత్వ నమోదు వల్ల సభ్యులకు పార్టీ అనేక విధాలుగా సేవలు అందజేయనుందని తెలిపారు. అంతేకాకుండా ప్రమాద బీమా కూడా వర్తిస్తుందన్నారు. పెండింగ్ లో భీమాల నగదు ఆరు నెలల్లో అకౌంట్లోకి జమ అవుతాయని తెలిపారు. రానున్న రోజుల్లో జనసేన పార్టీ అనేక కార్యక్రమాలు చేపడు తుందని. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఏటువంటి సమస్యలున్న తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గ(టె)డ్డిశివాజీ, ప్రధాన కార్యదర్శి దాసరి అచ్యుతరావు, అశోక్ కుమార్, జనసేన కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## నూతన జిల్లా జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** జిల్లా 10వ అదనపు జిల్లా జడ్జిగా పదవిని చేపట్టిన వి.నరేష్ ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, మర్యాదపూర్వకంగా కలుసుకొని శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయనకు మొక్కను బహుకరిస్తూ, నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశం అనకాపల్లి కోర్టు కాంప్లెక్స్‌లో ఆత్మీయతతో కూడిన వాతావరణంలో జరిగింది. జిల్లాలో ఇటీవల పెరుగుతున్న గంజాయి కేసులు మరియు ఇతర నేరాల పరిణామాల పై ఎస్పీ జడ్జి కి సమగ్ర వివరాలను అందజేశారు.

## జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ధర్నా





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** ఉపాధ్యాయులు, పాఠశాల, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎ.పి.టి.ఎఫ్.) ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శు క్రవారం జిల్లా స్థాయి ధర్నా కార్యక్రమం జరిగింది. ధర్నాను ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు ధర్మారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆ పరిష్కృతంగా ఉన్న పాఠశాలలు, విద్యారంగ, ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ఫించన్ దారుల సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా స్థాయి ధర్నా చేపట్టామన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే త్వరలో రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లోనూ తప్పనిసరిగా ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని, ఉన్నత పాఠశాలల్లో ప్రతి 40 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. పాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే పి.ఆర్.సీ. కమిషన్ ను నియమించి, ఐ.ఆర్. ని ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయుల బకాయిలన్నీ వెంటనే విడుదల చేయాలని కోరారు. సంఘ ప్రతినిధులు వై శ్రీనివాస్, నూకేష్, సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భద్రతా అప్రమత్తత చర్యలు

### జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడి, అలాగే పాకిస్తాన్‌లో భారతదేశం చేపట్టిన సర్జికల్ స్ట్రైక్ నేపథ్యంలో, అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ భద్రతపై మరింత అప్రమత్తమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, మార్గనిర్దేశన మేరకు, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, నాయకత్వంలో జిల్లాలో సమగ్ర భద్రతా తనిఖీలు చేపట్టబడ్డాయి. 2025 మే 08 న, రాత్రి 9 గంటల నుండి 11 గంటల వరకు అనకాపల్లి రైల్వే స్టేషన్ లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించబడ్డాయి. అం తేగాక, బస్ స్టాండ్లు, ఇతర ప్రజాభాగ స్వామ్య ప్రాంతాల్లో పూర్తిస్థాయి ఆంటీ–సాబటేజ్ తనిఖీలు సాగించబడ్డాయి. తనిఖీల ముఖ్యాంశాలు లో భాగంగా అనుమానాస్పద వ్యక్తులపై ఆకస్మిక తనిఖీలు,లాడ్జులు, హోటళ్లలో కొత్త అతిథుల వివరాల సేకరణ, సరిచూడటం,ప్రధాన జంక్షన్లు, జిల్లా ప్రవేశ మరియు నిష్క్రమణ పాయింట్ల వద్ద వాహన తనిఖీలు,ప్రజలకు అసౌకర్యం కలగకుండా అప్రమత్తంగా చర్యలు చేపట్టారు. ఈ తనిఖీలను అన్ని సబ్ డివిజ నల్ పోలీస్ అధికారులు పర్యవేక్షించారు. ఎస్‌హెచ్‌ఓలు, ఇన్స్పెక్టర్లు ఆయా ప్రాంతాల్లో తనిఖీలను సమీక్షించారు.జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు కట్టుబడి ఉన్నారని, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలపై తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ తుహిన్ సిన్హా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పీ శ్రీమతి ఎం.శ్రావణి, సర్కిల్ ఇన్స్పెక్టర్ లు ఎస్.హెచ్.ఓ లు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శుక్లా దృష్టికి చిన్న పత్రికల సమస్యలు



**అమరావతి:** గత నెల 25న విజయవాడలోని కందుకూరి కళ్యాణ మండపంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎం ప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (రి. నెం :312/2024)రాష్ట్ర కార్యవర్గ సమావేశం చేసిన తీర్మానాలను రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లూరు ప్రసాద్ కుమార్,కార్యదర్శి ఎం. శ్రీనివాసరావులు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకొని వెళ్లారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పలు అంశాలను ఆయనతో చర్చించారు. ఆయన వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. రెగ్యులారిటీ కలిగి ఎంప్యానల్ మెంట్ లేని స్మాల్ దినపత్రికలు, పిరియాడికల్స్ కు దశల వారిగా యాడ్స్ విడుదలకు హామీ ఇచ్చారు. ఎంప్యానల్డ్ స్మాల్ దినపత్రికలకు స్లాబ్ రేటు పెంపుదలకు సానుకూలంగా స్పందించారు.పెండింగ్ బిల్స్ తోపాటు ఈ ఏడాది విడుదల చేసిన ప్రకటనల బిల్లులు త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. నూతనంగా ఎంప్యానల్ మెంట్ చేసుకునేవారికి ఎదురవుతున్న సాంకేతిక సమస్యల విషయంలో కొంత వెసులు బాటు కల్పించాలని కోరిన మీదట ఆయన సానుకూలంగా స్పందించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా స్మాల్ పత్రికలకు అన్ని విధాలా సహకారం అందిస్తున్నందుకు ఆయనకు అసోసియేషన్ తరపున రాష్ట్ర ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

## జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 8 వినతులు

### జీవీఎంసీ సిటీ ప్లానరు వి.మీనాకుమారి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కి సంబంధించి 08 వినతులు వచ్చాయని జీవీఎంసీ సిటీ ప్లానరు వి.మీనాకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని సమావేశ మందిరం లో సిపి లు, డీసీపీలు, ఏసీపీలుతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సిటీ ప్లానరు మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం లో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నం దున, ప్రతి శుక్రవారం జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించేందుకు గానూ ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, సిటీ ప్లానరు అన్నారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి జివిఎంసి కి సంబంధించి 08 వినతులు వచ్చాయని, అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 01, 2వ జోన్ కు 02, 3వ జోన్ కు 01, 4వ జోన్ కు 01, 5వ జోన్ కు 02, 7వ జోన్ కు 01 వినతులు వచ్చాయని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం నమోదు చేసుకోవచ్చునన్నారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

## అందుబాటులో పదవ తరగతి మెమోరాండంలు

### జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి జి. అప్పారావునాయుడు

**అనకాపల్లి, (విశాఖ సమాచారవ్ బ్యూరో):** మార్చి 2025 ఎస్.ఎస్.సి. పబ్లిక్ పరీక్షల ఫలితాలు షార్ట్ మెమోలు పాఠశాల విద్యాశాఖ వెబ్సైట్లో అందుబాటులో ఉన్నట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి జి. అప్పారావునాయుడు తెలిపారు. మార్చి 2025 ఎస్.ఎస్.సి. పబ్లిక్ పరీక్షలు 17.03.2025 నుండి 01.04.2025 వరకు జరిగాయని మరియు ఫలితాలు 23.04.2025న ప్రకటించబడ్డాయని మరియు షార్ట్ మెమోలు (సబ్జెక్టుల వారీగా మార్కుల మెమోరాండం) 08.05.2025 నుండి వెబ్సైట్లో అందుబాటులో కలవని తెలిపారు.పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల లాగిన్ ఆధారాలను ఉపయోగించి "సబ్జెక్టుల వారీగా యొక్క మెమోరాండం"ని డౌన్లోడ్ చేసుకుని మరియు సంతకం చేసిన కాపీలను వారి సంబంధిత పాఠశాలల విద్యార్థులకు అందజేయవలనని, మెమోలలో ప్రదానోపాధ్యాయుడు లేదా తల్లిదండ్రులు గుర్తించిన ఏవైనా సవరణలను ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లలో సవరణలు చేయడానికి ప్రభుత్వ పరీక్షల సంచాలకులు, విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్, దృష్టికి తీసుకురావాలని తెలియజేయడమైనదన్నారు.

కావున ఏవైనా సవరణలు ఉంటే అవసరమైన పత్రాలను అందించాలని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచిస్తూ, సవరణలకు అడ్మిషన్ రిజిస్టర్లు సరిగ్గా జతచేయబడిన పాఠశాల రికార్డుల రుజువు మరియు ప్రధానోపాధ్యాయుడు ధృవీకరించిన షార్ట్ మెమో (సబ్జెక్ట్ వారీగా మార్కుల మెమోరాండం) కాపీ అందజేయాలని తెలిపారు. అందరి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పైన తెలిపిన ఆధారాల పత్రాలతో 25.05.2025 లోపు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు, విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్ పంపవలసియున్నదని తెలియజేసారు.

## గ్రంథాలయ విజ్ఞాన కేంద్రాలుగా తీర్చి దిద్దుతాం: చైర్మన్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్రంలోని ఖాళీగా ఉన్న లైబ్రరీ పోస్టులను త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని , ప్రతి జిల్లా గ్రంథాలయంలో ఈ-బుక్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామని, గ్రంథాలైనను విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దుతానని ఆంధ్ర యూనివర్సిటీ డాక్టర్ వి ఎస్ కృష్ణ లైబ్రరీకి విజిట్ చేసినటువంటి జి కోటేశ్వరరావు, చైర్మన్ ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ తనను కలిసిన విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు. రానున్న మెగా డీఎస్సీ కి లైబ్రరీలో అన్ని బుక్స్ అందుబాటులో ఉంచుతామని వీటిని సద్విని చేసుకోవాలని ఈ సందర్భంగా చైర్మన్ గారు విద్యార్థులను కోరారు లైబ్రరీలోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం సురేష్ మీనన్, రాజు, పట్నాయక్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ పట్టా పొందిన సి.ఎం రమేష్ తనయుడు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంటు సభ్యులు డాక్టర్ సి.యం.రమేష్ ద్వితీయ కుమారుడు ఇటీవల అమెరికాలోని ప్రతిష్టాత్మక మియామీ విశ్వవిద్యాలయం నుండి మాస్టర్స్ డిగ్రీను పూర్తిచేసారు.ఈ సందర్భంగా మియామీ యూనివర్సిటీ నిర్వహించిన కన్వోకేషన్ కార్యక్రమంలో కుటుంబసమేతంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా కుమారుడి కాన్వకేషన్ కి సంబంధించిన ఫోటోలను షేర్ చేస్తూ ప్రపంచంలోనే అత్యున్నతమైన విశ్వవిద్యాలయాల్లో ఒకటైన మియామీ యూనివర్సిటీ నుంచి ఉన్నత స్థాయి గ్రేడ్ నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడం పట్ల అత్యంత ఆనందదాయకంగా ఎంతో గర్వంగా ఉంది అని కుమారుడు రిత్విన్ గారిని అభినందిస్తూ పోస్ట్ చేశారు.తనయుడి విజయంనకు ముఖ్య కారణం అయిన కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే మార్గంలో మరిన్ని ఉన్నతమైన విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

## అత్యంత ఘనంగా శ్రీ సత్యదేవుని కళ్యాణ మహోత్సవం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** పట్టణంలోని సుంకరమెట్ట శ్రీ సత్యనారాయణ స్వామి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో రమా సమేత సత్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది.వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భముగాఉదయం సుప్రభాతసేవ, స్వామివారికి ప్రత్యేక పూజలు మరియు విష్ణు సహస్రనామ అర్చన, సామూహిక వ్రతములు జరిగాయి రాత్రి రమా సమేత శ్రీ సత్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవము ఘనంగా జరిగింది . కళ్యాణ మహోత్సవంలో ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళి దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 80వ వార్డు టిడిపి అధ్యక్షులు బొడ్డేడ జోగినాయుడు బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపూడి పరమేశ్వరరావు హాజరయ్యారు. కళ్యాణం మహోత్సవం అనంతరం కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు భవ్య శ్రీ డెవలపర్స్ అధినేత %శ్రీ% కాంద్రేగుల నాయుడు అల్పాహారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు పెంటకోట చందర్రావు సూరిశెట్టి బల్లమ్మ దొడ్డి భరత్ శ్రీకాకుళం గణపతి మారిశెట్టి భాస్కరరావు తురకలపూడి హేమాశ్వర్ కూటమి నాయకులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉచిత మెగా డీఎస్సీ క్రాష్ కోర్స్ శిక్షణ

### సహాయ సంచాలకులు బి.ఆశయ్య

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** జిల్లాలో డి ఎస్సీ కి అర్హులైన దివ్యాంగ అభ్యర్ధుల కోసం ఉచిత మెగా డి.ఎస్సీ. క్రాష్ కోర్సు శిక్షణను విజయవాడలో నిర్వహించనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు బి.ఆశయ్య శు క్రవారం ఒక ప్రకటనలో తెలిపార. ముఖ్యముగా దృష్టిలోపం, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ మొదలగు దివ్యాంగులైన, ఎస్జిటి టీచర్ పోస్టులకు అర్హతగల దివ్యాంగ అభ్యర్ధుల కోసం విజయవాడలో ఉచిత శిక్షణ శిభిరం ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. 40 శాతం వికలాంగత్వం ఉన్నవారు అర్హులని, ఈ నెల 11వ తేదీలోగా %ఎసటఎ.ఖజూవటంం.ఆఅ% వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని అయన సూచించారు. టెట్ లో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక చేయడం జరుగుతుందాని. ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక బోధనా పద్ధతుల్లో శిక్షణా, స్టడీ మెటీరియల్ పంపిణి, ఉచిత వసతి, భోజనం సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. కావున జిల్లాలో డి.ఎస్సీ కి అర్హత కలిగిన దివ్యాంగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ యొక్క భవిష్యత్తును మెరుగుపరచుకోవాలని అయన ఆ ప్రకటనలో కోరారు.

2nd pages11.qxd 5/9/2025 8:01 PM Page 7



## మృతి చెందిన మహిళా కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

### జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):–** నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన మహిళా కానిస్టేబుల్ డి.దుర్గాభవానీ తల్లి శ్రీమతి చందక రాధ కి, భద్రత ఎక్స్ గ్రేషియా రూ.4,00,000/– మొత్తాన్ని జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమం జిల్లా అదనపు ఎస్పీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ మాట్లాడుతూ, "పోలీసు శాఖలో విధుల నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలకు మేము ఎల్లప్పుడూ అండగా ఉంటాము. మహిళా కానిస్టేబుల్ దుర్గాభవాని సేవలు మరువలేనివి,"అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ తో పాటు, దుర్గాభవాని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారిని మంజుల వాణి



**దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్):–** మండలంలోని నాగయ్య పేట గ్రామపంచాయతీలో మండల ప్రత్యేక అధికారి మంజుల వాణి మరియు ఎంపీడీవో సువర్ణ రాజు స్పెషల్ సానిటేషన్ కార్యక్రమంలో భాగంగా మండల్ లెవెల్ అధికారులు మరియు గ్రామ పెద్దలు సచివాలయం సిబ్బంది గ్రామ సర్పంచి పాల్గొనడం జరిగినది . సంపద కేంద్రం చుట్టూ జంగిల్స్ చెత్తాచెదారంను క్లీన్ చేయడం జరిగినది, వెటర్నరీ హాస్పిటల్ లో ఎదురుగా స్కూల్ ఎదురుగా ఉన్న చెత్తను క్లీన్ చేయడం జరిగినది అలాగే సచివాలయం వెనుక భాగంలో చెత్త ఉండటం గమనించిన మేడం దానిని కూడా తొలగించడం జరిగినది, డ్రైనేజర్స్ పరిశీలించడం జరిగినది మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూడా పరిశీలించడం జరిగినది ,వారి వెంట వెటర్నరీ డాక్టర్ భాగ్య, హౌసింగ్ ఏఈ తేజ, ఏపిఎం ప్రభాకర్, ఇన్చార్జి ఈవో పి ఆర్ డి అనంత ఉమాదేవి, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ విపివి త్రినాథ్, పంచాయతీ కార్యదర్శి జీవన్ బాబు, ఎమ్మార్పీ పైడిరాజు సచివాలయం సిబ్బంది పాల్గొనడం జరిగినది.

## 30 రకాల నవధాన్య విత్తనాలతో 160 కిట్లు తయారీ




**నాతవరం, (విశాఖ సమాచారమ్):–** పాయకరావుపేట వ్యవసాయ సబ్ డివిజన్ నాతవరం మండలంలో పి కె గూడెం యూనిట్ 100% ప్రకృతి వ్యవసాయ గ్రామం అయినటువంటి ఎస్ బి పట్నం గ్రామంలో గ్రామ సర్పంచ్ సతీష్ ఆధ్వర్యంలో 30 రకాల (పి.ఎం. డి ఎస్)నవధాన్య విత్తనాలతో 160 కిట్స్ తయారు చేయడం జరిగినది. గ్రామ సర్పంచ్ సతీష్ ఈ నవధాన్యాల వేయడం వల్ల ఉపయోగాలు గురించి వివరించి చెప్పడం జరిగినది, నవధాన్య విత్తనాలు వేయడం వల్ల భూమిసారవంతం అవుతుంది, సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయి, భూమి గుళ్ళ బారుతుంది. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. పురుగులు తెగుళ్లు రావు అలాగే భూములోని సేంద్రియ కర్బను శాతం స్థిరంగా ఉంటుంది. అలాగే ప్రధాన పంట దిగబడి బాగుంటుంది, అలాగే పశువులకు మేతగా ఉపయోగించుకోవడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉంటాయి పాలు దిగిబడి బాగా వస్తుంది వెన్న శాతం పెరుగుతుంది అని జిల్లా బ్లూమ్ ఇన్చార్జి గోవింద వివరించి చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీ శైలజ ,విజయ సాహితీ గ్రామ పెద్దలు, ఎ పి సి ఎన్ ఎఫ్ సిబ్బంది వెంకటలక్ష్మి ఎం టి,ఎల్1, నారాయణమూర్తి ,దుర్గా మాతాజీ,ధనలక్ష్మి, సంధ్య, గణేష్ పాల్గొన్నారు.

## రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

### పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):–** మండలంలోని తైపురం గ్రామపంచాయతీలో మురుగునీరు రోడ్లపై చేరి దుర్గంధం వస్తుందని ఇంకుడు గుంతలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వదిలేయడంతో ప్రజల తీవ్ర అవస్థలు పడుతూ అనారోగ్యం పాలవుతున్నారని స్థానిక పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. సంబంధించిన ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి మురుగునీరుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

## స్టేట్ ఫస్ట్ ర్యాంక్ విద్యార్థి సాయి ని అభినందించిన రాజీవ్ కృష్ణ



**కొవ్వూరు విశాఖ సమాచారమ్ :–**
**కొవ్వూరు నియోజకవర్గ ప్రతినిధి కొల్లి. వెంకట. చిన్నబాబు :–**

మద్దూరు గ్రామానికి చెందిన టి సాయి ఎంపీసీ మ్యాథమెటిక్స్ లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించినందుకు చాలా సంతోషంగా ఉందని కొవ్వూరు నియోజకవర్గం తెలుగుదేశం నాయకులు యస్. రాజీవ్ కృష్ణ తెలిపారు.

ఆయన క్యాంప్ ఆఫీసులో విద్యార్థినికి చిరు సత్కరించి అభినందించడం జరిగింది. అంతేకాకుండా త్వరలో దేశంలోనే అత్యుత్తమ కాలేజీలో సీటు సాధించబోతున్నందుకు ఆనందంగా ఉందన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఈ విద్యార్థి ఎంతో కష్టపడి ప్రతిరోజు మద్దూరు నుండి సమిశ్రగూడెంలో ఉన్న కాలేజీకి సైకిల్ పై వెళ్లి శ్రద్ధగా చదివి ఈ ర్యాంక్ సాధించారని, మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన విద్యార్థినిని అభినందించి నిండు మనసుతో ఆశీర్వదించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి నియోజకవర్గంకి మంచి పేరు తీసుకొస్తారని ఇప్పటికే సాయి గోదావరి జిల్లాలకు మంచి కీర్తిని ప్రశంసను తీసుకువచ్చారని ఆశాభావం వ్యక్తం చేశారు.

తన వంతుగా విద్యార్థి చదువుకు అవసరమైన వనరులు సమకూరుస్తానని రాజీవ్ కృష్ణ అన్నారు ఈ కార్యక్రమంలో ఇమ్మని వీర శంకరం,విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, నాయకులు విద్యార్థునిని అభినందించారు.

## మత్స్యపరిశ్రమ అభివృద్ధికి సహకరించాలి: మంత్రి అచ్చంనాయుడు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** విశాఖపట్నంలోని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మైలపల్లి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి కె.అచ్చంనాయుడును శుక్రవారం విజయవాడలో కలిసి మత్స్యపరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. మత్స్యకారుల సేవలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల జీవన భృతిని అన్సీజన్ ప్రారంభంలోనే ఇచ్చినందుకుగాను మర్యాదపూర్వకంగా మంత్రిని శాలువా, జ్ఞాపికతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ సిఫారసు చేసిన పత్రాలను మంత్రికి అందజేసారు. వంశీకృష్ణ శ్రీనివాస్ సిఫార్సు చేసిన పత్రంలో పెండింగ్లో ఉన్న ఆయిల్ సబ్సిడీ మొత్తం చెల్లింపు,కాలిన, మునిగిన బోట్ల యజమానులకు నష్టపరిహారం,డీజిల్ ఆయిల్ సబ్సిడీ లీటర్ కు ప్రస్తుతం ఉన్న తొమ్మిది రూపాయల నుండి 15 రూపాయల వరకు పెంచాలన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి అన్నింటినీ దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. ఫిషింగ్ హార్బర్లో జరుగుతున్న అభివృద్ధి,మత్స్య పరిశ్రమ, మత్స్యకారులకు



అవసరమగు సదుపాయాలు కల్పించాలని అసోసియేషన్ కోరింది. ఈ వారంలో ఫిషింగ్ హార్బర్ సందర్శించి కూటమి ప్రభుత్వం తరఫున అన్ని వసతులు కల్పించి మత్స్య పరిశ్రమను ప్రోత్సహిస్తామని మంత్రి పేర్కొన్నారు. మంత్రిని కలిసిన బృందములో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మర పడవల సంఘం అధ్యక్షులు మైలపల్లి లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షులు పి సి అప్పారావు, ప్రధాన కార్యదర్శి సురపతి నర్సింగరావు, కార్యదర్శి మున్నం బాలాజీ,ఆర్గనైజింగ్ కార్యదర్శి గనగల రాజేష్ తదితరులు ఉన్నారు.

## పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి

### రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖామంత్రి కొండపల్లి పిలుపు
### బలిఘట్టంలో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన



**కొత్తవలస, (విశాఖ సమాచారమ్):–** ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా జిల్లాకు మొదటివిడతలో మంజూరైన నాలుగు పార్కుల్లో, మొట్టమొదటి పార్కుకు బలిఘట్టంలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. సుమారు 57 ఎకరాల విస్తీర్ణంలో, దాదాపు రూ.7కోట్ల వ్యయంతో ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం ఒకవైపు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూనే అభివృద్ధిపై దృష్టి పెట్టిందని అన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తోందని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచం భారతదేశంవైపు చూస్తోందని, దేశంలో ఏర్పాటయ్యే పరిశ్రమలను రాష్ట్రంలో ఏర్పాటు చేయించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. పరిశ్రమలను స్థాపించేవారికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయనున్నామని, దీనిలో భాగంగా మొదటివిడత 50 పార్కులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాకు మొదటి దశలోనే నాలుగు పార్కులను మంజూరు చేశారని, వీటిని ఎస్.కోట, గజపతినగరం, బొబ్బిలి, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమలను పెట్టేవారికి ఈ పార్కుల్లో అన్ని వసతులతో కూడిన స్థలాలను కేటాయిస్తామని, వివిధ పథకాల క్రింద 25 శాతం నుంచి 45 శాతం వరకు సబ్సిడీ, విద్యుత్ ఛార్జీల్లో, పన్నుల్లో రాయితీ, బ్యాంకులనుంచి రుణాలు తదితర ప్రోత్సాహకాలు ఉన్నాయని తెలిపారు. యువత, మహిళా సంఘాలు పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకు రావాలని కోరారు. వీటివల్ల తాము ఉపాధి పొందడమే కాకుండా, మరికొంతమందికి ఉపాధి కల్పించినవారు అవుతారని మంత్రి పేర్కొన్నారు. బలిఘట్టంలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కులో సుమారు రూ.96 కోట్ల పెట్టుబడితో 76 చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని, 1500 మందికి ప్రత్యక్షంగా, 500 మందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉందని చెప్పారు.

ఎస్.కోట ఎంఎల్ఏ కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ, మొదటి దశలోనే తమ నియోజకవర్గానికి ఎంఎస్ఎంఈ పార్కును మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి, మంత్రి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 2014లోనే ఇక్కడ ఈ పార్కును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారని, అది ఇన్నాళ్లకు కార్యరూపం దాలుస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

ఈ సమావేశంలో ఎంపిపి నీలశెట్టి గోపమ్మ, సర్పంచ్ ఎం.ఎర్రయ్య రామస్వామి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మురళీమోహన్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జిఎం శ్రీధర్, సహాయ సంచాలకులు బి.రామకృష్ణ, ఆర్‌డిఓ కీర్తి, తాహసీల్దార్ నీలకంఠేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

## సైనికుడు మురళి నాయక్ మృతి విషాదకరం

### సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు




**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):–** దేశ రక్షణలో ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళి నాయక్ మృతి పట్ల గౌరవ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ శాసనసభ నియోజకవర్గంలోని గోరంట్ల మండలానికి చెందిన మురళి నాయక్, జమ్మూకాశ్మీర్‌లో పాకిస్థాన్ సైన్యం జరిపిన బాంబు దాడిలో వీరమరణం పొందారు. ఈ నేపథ్యంలో స్పందించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు తమ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ,దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన మురళి నాయక్ మృతి అత్యంత బాధాకరమని, ఆయన త్యాగం చిరస్థాయిగా గుర్తింపు పొందుతుందన్నారు. అమర వీరుడిగా నిలిచిన మురళి నాయక్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ప్రతి సైనికుడి త్యాగం, దేశ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలుస్తుందని ఆయన అన్నారు.

## నేత్రపర్వంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తిరుక్కళ్యాణం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** అల్లిపురం శ్రీ వెంకటేశ్వర మెట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తిరుక్కాళ్యాణ మహోత్సవం గురువారం రాత్రి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జి. వి. రమాబాయి పర్యవేక్షణలో నేత్ర పర్వంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేతడైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ముందుగా దేవస్థానం చుట్టూ పల్లకిలో ఊరేగించారు. అనంతరం స్వామి వారిని కల్యాణ వేదికపై వే%శీ%చేయించారు. శ్రీ స్వామివారిని నయనానందకరంగా అలంకరించారు. ఆలయ కళ్యాణ మండపంలో జరిగిన స్వామి వారి కళ్యాణంకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు మధ్య శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం శ్రీ శ్రీనివాసుని కల్యాణ వేడుకను చూడముచ్చటగా నిర్వహించారు. జీలకర్ర బెల్లం,తాళి, తలంబ్రాలు వంటి ఘట్టాలు పండితులు అత్యంత వేడుకగా జరిపారు. ఆలయ అర్చకులు గొడవర్తి వీర రాఘవాచారి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణాన్ని వేడుకగా నిర్వహించారు ఈ నెల 13వరకు శ్రీ స్వామివారి కల్యాణోత్సవాలుఘనంగా జరుగుతాయని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జి. వి. రమాబాయి తెలిపారు.

## భారత్-పాక్ హై టెన్షన్... ఆసక్తికర పోస్టు చేసిన రవిశాస్త్రి

భారత క్రికెట్ జట్టు మాజీ ఆటగాడు, మాజీ ప్రధాన కోచ్, ప్రముఖ వ్యాఖ్యాత రవిశాస్త్రి తాజాగా దేశ ఐక్యత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ తో తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో... ప్రస్తుత భారతదేశాన్ని ఒక అద్భుతమైన క్రీడా జట్టుతో పోలుస్తూ, ప్రధాని మోదీని 'GOAT' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) కెప్టెన్‌గా అభివర్ణించడం విశేషం.

తన క్రీడా జీవితంలో ఎన్నో యునైటెడ్ జట్లను చూశానని, కానీ 150 కోట్ల మంది ప్రజలతో కూడిన 'ఇండియా యునైటెడ్' జట్టును చూడటం ఇదే మొదటిసారని రవిశాస్త్రి పేర్కొన్నారు. ఈ అద్భుతమైన జట్టు మన మహోన్నత సాయుధ బలగాల నేతృత్వంలో మైదానంలోకి దిగిందని అభివర్ణించారు.

దేశాన్ని నడిపిస్తున్న ఈ జట్టుకు నరేంద్ర మోదీ జీ మరియు ఆయన ప్రభుత్వం కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారని శాస్త్రి ప్రశంసించారు. ఇలాంటి పటిష్టమైన, సమష్టి స్ఫూర్తితో ముందుకు సాగుతున్న భారతదేశాన్ని తాను ఇంతకు ముందెన్నడూ చూడలేదని రవిశాస్త్రి తన మనోభావాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, దేశ నాయకత్వానికి, ప్రజల ఐక్యతకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలుపుతూ, "జై హింద్" అంటూ ట్వీట్ చేశారు.

## అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే... నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిందే

### పెందుర్తి పీఎంశ్రీ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఉద్యోగ మేళాలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్
### నిరుద్యోగ యువత సౌకర్యార్థం జిల్లాలో మరిన్ని ఉద్యోగ మేళాలు నిర్వహిస్తామని వెల్లడి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** పుష్కలంగా ఉన్న ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే... యువత తప్పకుండా నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ప్రధానంగా సాఫ్ట్ స్కిల్స్ పై దృష్టి సారించాలని, బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని హితవు పలికారు. యూట్యూబ్ లు, ఇన్ స్టాలు చూసి ఎంటర్ ప్రెన్యూర్లం అయిపోతాం.. కంపెనీలు స్థాపిస్తామని ఉవ్విల్లూరుతున్న చాలా మంది విజయ సాధనలో విఫలమవుతున్నారని, దానంతటికీ కారణం నైపుణ్యాలు లేకపోవటమేనని గుర్తు చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు సారథ్యంలో పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, నగర మేయర్ పీలా శ్రీనివాసరావులతో కలిసి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పాల్గొని




ప్రసంగించారు. ఉద్యోగ సాధనలో యువత చొరవ చూపాలని, నైపుణ్యాలను పెంపొందించుకోవటంలో ప్రధానంగా దృష్టి సారించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్ష మేరకు ప్రతి ఇంటి నుంచీ ఒక ఎంటర్ ప్రెన్యూర్ తయారు కావాలని, పేదరికం లేని సమాజం స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. ప్రస్తుతం ఉద్యోగాలకు కొదవ లేదని, నైపుణ్యాలు ఉంటే ఉద్యోగాలు యువత సొంతమని కలెక్టర్ అన్నారు. కంపెనీల అవసరాలకు తగిన విధంగా యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. స్కిల్ ఉంటే ఏ కంపెనీ కూడా మిమ్మల్ని వదులుకోదని యువతను ఉద్దేశించి అన్నారు. పెందుర్తి పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా జాబ్ మేళాలో 2,825 ఉద్యోగ ఖాళీలతో 44 కంపెనీలు ముందుకు వచ్చాయని వివరించారు. నిరుద్యోగ యువత సౌకర్యార్థం జిల్లాలో మరిన్ని ఉద్యోగ మేళాలు నిర్వహిస్తామని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే పట్టుబట్టి అధిక కంపెనీలు భాగస్వామ్యం అయ్యేలా కృషి చేశారని గుర్తు చేశారు.

కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు, ఉపాధి కల్పనా అధికారి సుబ్బిరెడ్డి, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

2nd pages11.qxd 5/9/2025 8:01 PM Page 8



# నేటి నుంచే హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు







**హైదరాబాద్, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ప్రపంచ సుందరి (మిస్ వరల్డ్) పోటీలకు సమయం ఆసన్నమైంది. శనివారం సాయంత్రం గచ్చిబౌలి స్టేడియంలో అంగరంగ వైభవంగా ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. మిస్ వరల్డ్ సంస్థతో కలిసి ప్రభుత్వం.. ఈ పోటీలు నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ పోటీల నిర్వహణ ద్వారా తెలంగాణ రాష్ట్రం ప్రపంచ పటంపై ప్రత్యేక స్థానం పొందుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసింది.

విదేశీ ప్రసార మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించడం ద్వారా రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడిరపజేసే ప్రయత్నం చేస్తోంది. ప్రపంచ దేశాల సుందరీమణులతో పాటు అంతర్జాతీయ మీడియా సైతం రానుండటంతో రాష్ట్ర రాజధాని నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దింది. పటిష్ట భద్రత సహా అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తి అయినట్లు అధికరావర్గాలు వెల్లడిరచాయి.

**పలు దఫాలుగా సీఎం సమీక్షలు**

రాష్ట్ర ప్రతిష్టను పెంచేందుకు, పెట్టుబడుల ఆకర్షణకు అందాల పోటీలను వినియోగించుకోవాలని భావిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇప్పటికే పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఏర్పాట్లను సమీక్షించడంతో పాటు, కార్యక్రమా లు జరిగే ప్రదేశాలను కూడా సందర్శించారు. కంటెస్టెంట్లతోనూ ఒకసారి భేటీ అయ్యారు. పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రకృతి, పర్యా వరణ పరంగా అన్ని హంగులు ఉన్నా, తెలంగాణ ఆ రంగంలో వెనుకబడిరదని భావిస్తున్న ప్రభుత్వం.. ఇకపై 'తెలంగాణ జరూర్ ఆనా'(తప్పకుండా తెలంగాణ రండి) అనే నినాదాన్ని ప్రపంచవ్యాప్తం చేయా లని నిర్ణయించింది. తద్వారా పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతో పాటు పెట్టుబడుల సాధన, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని భావిస్తోంది.

**సర్వాంగ సుందరంగా నగరం**

ఈ పోటీల్లో పాల్గొనడానికి దాదాపు 110 మంది సుందరీమణులు ఇప్పటికే నగరానికి చేరుకున్నారు. నిర్వహణ సంస్థ మిస్ వరల్డ్ లిమిటెడ్‌కు చెందిన 28 మంది ప్రతినిధులు, మరో 17 మంది సహాయకులు కూడా వచ్చేశారు. రానున్న రెండురోజుల్లో మరికొంత మంది ప్రతినిధులు వివిధ దేశాల నుంచి వస్తారని నిర్వాహకులు తెలిపారు. అధికారులు నగరానికి చేరుకున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో సహా.. ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ విమానాశ్రయాల్లో కూడా ప్రపంచ సుందరి పోటీలకు వచ్చే వారికి ఆహ్వానం పలుకుతూ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయించింది. గత వారం రోజులుగా వస్తున్న అతిథులు అందరికీ తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు అనుగుణంగా స్వాగతం పలుకుతున్న పర్యాటక శాఖ, వారి బసకు అవసరమైన ఏర్పాట్లను కూడా చేసింది. విదేశీ ప్రతినిధులు బస చేసిన ట్రైడెంట్ హోటల్ దగ్గర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కాగా, ప్రపంచ సుందరి పోటీల కోసం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో రిహార్సల్స్ ఉత్సాహంగా కొనసాగాయి. ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న వివిధ దేశాల పోటీదారులు ఆకర్షణీయమైన వస్త్రాలు ధరించి ర్యాంప్ వాక్ చేశారు.

**సామాన్యులకూ వీక్షించే చాన్స్**

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఈ నెలా ఖరు వరకు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాన్ని పరిమిత సంఖ్యలో సామాన్యులకూ కల్పించేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టూరిజం వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకున్న వారికి పోటీలు జరిగే ఒక్కో కేంద్రంలో వెయ్యి మంది చొప్పున మొత్తం 5 కేంద్రాల్లో 5వేల మందికి మిస్ వరల్డ్ పోటీలను వీక్షించే అవకాశం కల్పించాలని భావిస్తున్నారు.

**మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవాకు ఘనస్వాగతం**

'మిస్ వరల్డ్- 2024' విజేతగా నిలిచిన క్రిస్టినా పిస్కోవా (చెక్ రిపబ్లిక్) శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న క్రిస్టినాకు తెలంగాణ అధికారులు ఘనస్వాగతం పలికారు. కళాకారులు సంప్రదాయ రీతిలో ఆమెను స్వాగతించారు.

**'మిస్ వరల్డ్'పై యుద్ధం నీడలు**

భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీల నిర్వాహక సంస్థ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆయా దేశాల నుంచి వచ్చిన వారందరి భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. అయితే, హైదరాబాద్‌లోని వ్యూహాత్మక సంస్థల భద్రత, సామాన్య ప్రజల రక్షణకు అత్యంత ప్రాధాన్యమివ్వాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో మిస్ వరల్డ్ పోటీలకు మూడు వారాలపాటు పూర్తిస్థాయి భద్రత పెద్ద సవాలే. ఈ నేపథ్యంలో కేంద్రం అభిప్రాయం ప్రకారం నడుచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. పాకిస్థాన్‌లో ఉన్న అమెరికా పౌరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. దాంతో మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సైతం పోటీలను కొనసాగిస్తే తలెత్తే సమస్యలపై ఆలోచిస్తోందని, అంతర్జాతీయంగా అభిప్రాయాలను సేకరిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వంతోనూ ఎప్పటికప్పుడు చర్చిస్తోందని తెలిసింది.

**విమాన సర్వీసులపై ప్రభావం**

మిస్ వరల్డ్ వేడుకలకు 116 దేశాల నుంచి అందాల భామలు రావాల్సి ఉండగా.. ఇప్పటికి 109 మంది వచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇంకా స్పాన్సరర్లు, అంతర్జాతీయ మీడియా రావాల్సి ఉంది. కొందరు పోటీల మధ్యలో చేరుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పుడు హఠాత్తుగా విమానాల రూట్ల మార్పు, సర్వీసుల రద్దు ప్రభావం సైతం అందాల పోటీలపై ఉంటుందని భావిస్తున్నారు.

**అవుట్‌డోర్‌లోనే ఎక్కువ..**

షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10న ప్రారంభ వేడుకల అనంతరం యువతులంతా 12వ తేదీ నుంచి నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం, హైదరాబాద్‌లోని చార్మినార్, లాడ్‌బజార్, వరంగల్‌లోని వేయిస్తంభాల గుడి, రామప్ప ఆలయం, యాదగిరిగుట్ట, పోచంపల్లి, మహబూబ్‌నగర్‌లలో పర్యటించేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ ప్రాంతాల్లో అందాల భామల పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత కల్పించడమంటే పోలీసులకు పెద్ద సవాలే.

# విశాఖ పరిశుభ్రతకు ప్రాధాన్యం

## విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** విశాఖ నగర పరిశుభ్రతకు, సుందరీకరణకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా విశాఖపట్నం ఆర్కే బీచ్ లో బీచ్ క్లీనింగ్ యంత్రాన్ని స్వయంగా నడిపి, వాటి పనితీరును పరిశీలించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఎంతో సుందరమైన విశాఖ నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని, అలాగే విశాఖకు సు విశాలమైన సాగర తీరం ఉందని ఎంతోమంది పర్యాటకులు, సందర్శకులు విశాఖ నగరానికి వస్తూ ఉంటారని, వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు విశాఖ సాగర తీరాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రాధాన్యత నివ్వాలని అధికారులకు సూచించారు. విశాఖపట్నం ఆర్కే బీచ్ లో బీచ్ క్లీనింగ్ యంత్రంతో శుభ్రం చేసే వాహనాల పనితీరును, విధానాన్ని పరిశీలించడంతోపాటు స్వయంగా బీచింగ్ క్లీనింగ్ వాహనాన్ని మేయర్ నడిపారు. సాగర తీరంలో అపరిశుభ్రతకు తావివ్వకుండా నిత్యం పారిశుధ్య కార్మికులచే వ్యర్థాలను తరలించి ఆ ప్రదేశాలను పరిశుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని, అలాగే వ్యర్థాలు వేయకుండా సందర్శకులు కు, పర్యాటకులకు దుకాణాదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ ను మేయర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ప్రజారోగ్యపు అధికారులు, పారిశుద్ధ కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారత్ కు ఏం కావాలన్నా మేమున్నాం... అదానీ, అంబానీ



పాకిస్తాన్‌తో యుద్ధం నేపథ్యంలో భారత్ కు పూర్తి అండగా ఉంటామని, గౌతమ్ అదానీ, అంబానీలు ప్రకటించారు. 'ఇలాంటి సమయంలోనే మన ఐక్యత, నిజమైన బలం బయటికొస్తుంది. సాయుధ బలగాలకు అండగా ఉన్నాం' అని అదానీ ట్వీట్ చేశారు. 'దేశానికి అన్ని విధాలుగా అండగా నిలిచేందుకు రిలయన్స్ కుటుంబం సిద్ధంగా ఉంది' అని ముకేశ్ అంబానీ ఓ ప్రకటనలో తెలిపారు.

# మూడో రోజు ముగిసిన టీడీపీ శిక్షణ తరగతులు



**అమరావతి, (విశాఖ సమాచారమ్):-** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనాయకులు నారా లోకేష్ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన రాజకీయ శిక్షణ కార్యక్రమం మూడో రోజు విజయంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ నాయకులు లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

# బాలిక సాధికారత కార్యక్రమాన్ని ప్రారంభించిన హోమ్ మంత్రి అనిత



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** ఎన్టీపీసీ సింహాద్రి ఆధ్వర్యంలో దీపాంజలి నగర్ శకుంతలం ఆడిటోరియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బాలికా సాధికారత కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు చట్టాలపై అవగాహన, స్వీయ రక్షణ అన్న అంశాలపై జూన్ 6వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల ద్వారా బాలికల్లో చైతన్యాన్ని పెంచే విధంగా ఎన్టిపిసి ఏర్పాట్లు చేయడం అభినందనీయం అన్ని రంగాల్లో మహిళలు పురోగతి సాధించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మహిళా శక్తి ఎంత పెరిగితే దేశం యొక్క శక్తి అంత పెరుగుతుంది అన్న సానుకూల ఆలోచనతో తల్లిదండ్రులు కూడా వారిని ఉన్నత స్థానాలకు చేరే విధంగా ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్టిపిసి జిజిఎం, ఏజీఎం, తదితర సిబ్బంది పాల్గొన్నారు.


# సీఐడీ విచారణకు సజ్జల, దేవినేని హాజరు



**గుంటూరు, (విశాఖ సమాచారమ్):-** వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి శుక్రవారం సీఐడీ విచారణకు హాజరయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మంగళగిరి టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడికి సంబంధించి ఆయనపై కేసు నమోద్కెంది. ఈ క్రమంలో గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. సజ్జలతో పాటు దేవినేని అవినాష్ విచారణకు వచ్చారు. సీఐడీ కార్యాలయం వద్దకు మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి వచ్చారు. కోర్టు రోడ్డు వద్దే సజ్జల వాహనాన్ని పోలీసులు నిలిపివేశారు. దీంతో అక్కడి నుంచి సీఐడీ కార్యాలయానికి ఆయన నడుచుకుంటూ వచ్చారు. విచారణ నేపథ్యంలో అక్కడ పోలీసులు మోహరించారు.

విచారణ ముగిసిన అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ ఆఫీసుపై దాడికి సంబంధించి అక్రమ కేసులో విచారణకు పిలిచారని.. బాధ్యత కలిగిన పౌరుడిగా విచారణకు వచ్చానని తెలిపారు. గతంలో కూడా ఒకసారి విచారణకు వచ్చానని చెప్పారు. "దాడులకు మా నాయకుడు జగన్ వ్యతిరేకం. ఆ ఘటన జరిగిన సమయంలో నేను ఊళ్లో లేను. అధికారులు అడిగిన ప్రశ్నకి నాకేమీ తెలియదని సమాధానం చెప్పాను. ఏడాది కాలంగా రెడ్ బుక్ వేధింపులు ఎక్కువయ్యాయి. ఎన్నికలకు ముందునుంచే రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తించారు. ఇష్టం వచ్చినట్లు కేసులు పెట్టడం, వేధించడం జైలుకు పంపడమే పనిగా పెట్టుకున్నారు. చంద్రబాబు నుంచి కిందిస్థాయి వరకూ ఇదే విధంగా వ్యవహరిస్తున్నారు. కంతేరు ఎంపీటీసీ అయిన మహిళ పట్ల కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తించారు" అని సజ్జల పేర్కొన్నారు.

# మిడిల్ క్లాస్ ఎమోషన్స్.. హారర్ ఎలిమెంట్స్..



శుభం మూవీ రివ్యూ

చిత్రం: శుభం

రేటింగ్: 2.75/5

తారాగణం: హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి, షాలినీ కొండెపూడి, వంశీధర్ గౌడ్, సమంత తదితరులు..

సంగీతం: వివేక్ సాగర్, క్లింటన్ సెరెజో,

ఎడిటింగ్: ధర్మేంద్ర

నిర్మాత: సమంత రుత్ ప్రభు

దర్శకత్వం: ప్రవీణ్ కండ్రేగుల

విడుదల: మే 9, 2025

హీరోయిన్ గానే మనందరికీ తెలిసిన సమంత, నిర్మాతగా మారి చేసిన మొదటి సినిమా. పైగా చాన్నాళ్ల తర్వాత అతిథి పాత్రలో సమంత తెరపై కనిపించిన సినిమా. వీటికితోడు ట్రయిలర్ కూడా క్లిక్ అవ్వడంతో శుభం సినిమాపై ఓ సెక్షన్ ఆడియన్స్ ఆసక్తి చూపించారు. మరి ఆ ఆసక్తిని థియేటర్లలో శుభం సినిమా నిలబెట్టుకుందా.. ప్రేక్షకుల్ని అంతే ఆసక్తిగా కూర్చోబెట్టగలిగిందా? చూద్దాం..

భీమిలిపట్నంలో నివశించే 3 యువ జంటల కథ ఇది. ముగ్గురు స్నేహితుల్లో ఇద్దరికి ఆల్రెడీ పెళ్లయిపోతుంది. మూడో వ్యక్తి కేబుల్ ఆపరేటర్ శ్రీను (హర్షిత్) పెళ్లితో సినిమా మొదలవుతుంది. పెళ్లి చూపుల్లో శ్రీవల్లి (శ్రియ)ని ఇలా చూసి అలా ఇష్టపడతాడు శ్రీను. చకచకా పెళ్లి కూడా చేసుకుంటాడు. ఫస్ట్ నైట్ సీన్ లో అసలు ట్విస్ట్. జన్మజన్మల బంధం అనే సీరియల్ అంటే శ్రీవల్లికి చచ్చేంత ఇష్టం. ఫస్ట్ నైట్ ను కూడా పక్కనపెట్టి ఆ సీరియల్ కు అతుక్కుపోతుంది. అడ్డొచ్చిన భర్తకు వార్నింగ్ కూడా ఇస్తుంది. ఆ సమస్య తనది మాత్రమే అనుకుంటాడు శ్రీను.

కానీ తన స్నేహితులిద్దరిదీ అదే బాధ అనే విషయం తర్వాత తెలుసుకుంటాడు. ఆ తర్వాత జరిగిన మరికొన్ని పరిణామాలతో ఊరంతా అదే సమస్య అని తెలుసుకుంటాడు. ఇంతకీ ఆ సీరియల్ కు ఊరిలో మహిళలకు ఏంటి సంబంధం? సీరియల్ టైమ్ కు మహిళలంతా విచిత్రంగా ప్రవర్తించడానికి కారణం ఏంటి? మధ్యలో శ్రీను బృందానికి డిష్ కుమార్ (వంశీధర్ గౌడ్) ఇచ్చిన షాక్ ఏంటి? ఈ మొత్తం ఎపిసోడ్ లో సమంత పాత్ర ఏంటి? ఈ ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

ఈమధ్య వచ్చిన మత్తువదలరా-2 సినిమాలో కామెడీ కోసం సీరియల్ ను వాడుకున్నారు. కానీ ఈ శుభం సినిమాలో కథా వస్తువే ఓ సీరియల్. సినిమా మొత్తం ఆ సీరియల్ చుట్టూరా తిరుగుతుంది. ఓ చిన్న ఊరు, టీవీ సీరియల్, ఊరిలో మహిళలకు టీవీ సీరియల్ తో లింక్. పాలు నీళ్ల బంధం.. ఇది జన్మజన్మల బంధం అనే పాటతో టీవీ సీరియల్ స్టార్ట్ చేసి కథను వాడుకున్న విధానం సినిమాకు పెద్ద ప్లస్ అయింది. ఇలా పాత్రల పరిచయంతో పాటు, సినిమాలో మెయిన్ పాయింట్ ను ఆసక్తికరంగా చెప్పాడు దర్శకుడు ప్రవీణ్.

బేసిగ్గా ఇదొక హారర్-కామెడీ. కాబట్టి పెద్దగా ట్విస్టులు ఆశించనక్కర్లేదు. అయినప్పటికీ సినిమాలో ఓ ట్విస్ట్ ఉంది. దాన్ని ఇక్కడ చెప్పడం కరెక్ట్ కాదు కాబట్టి చెప్పలేదు. ఈ సంగతి పక్కనపెడితే, సినిమా ప్రమోషన్ లో భాగంగా ఫస్ట్ నైట్ సీన్ ను రిలీజ్ చేశారు. సినిమా మొత్తానికి అత్యంత కీలకమైన ఆ సన్నివేశాన్నే విడుదల చేసి అంచనాల్ని సెట్ చేశారు మేకర్స్.

మిడిల్ క్లాస్ కథ, సన్నివేశాలు ఫ్రెష్ గా ఉండడం, వాటికి కొత్త ముఖాలు యాడ్ అవ్వడం వల్ల ఫస్టాఫ్ మొత్తం చక్కగా సాగిపోతుంది. మెయిన్ పాయింట్ ను రివీల్ చేసిన తర్వాత కథపై ఆసక్తి మరింత పెరుగుతుంది. అదే ఊపులో మంచి సీన్ తో ఇంటర్వెల్ కార్డ్ వేయడం కూడా బాగుంది.

సెకెండాఫ్ కు వచ్చేసరికి మాత్రం దర్శకుడు కాస్త గాడితప్పాడు. కథను అటుఇటు తిప్పాడు, కామెడీ కోసం అదనంగా కొన్ని సన్నివేశాలు రాసుకున్నట్టు అనిపించింది. స్క్రిప్ట్ లో అక్కడక్కడ లోపాలు కనిపించాయి. అలా సెకండాఫ్ మిడ్ పోర్షన్ లో కాస్త గాడి తప్పిన కథ, ప్రీ-క్లయిమాక్స్ నుంచి మళ్లీ ఊపందుకుంటుంది. మంచి క్లయిమాక్స్ తో సినిమాకు శుభం కార్డు వేశాడు దర్శకుడు.

2 గంటల 5 నిమిషాల ఈ సినిమాలో హారర్ ఎలిమెంట్స్ జనానికి కొత్త కాదు. మిడిల్-క్లాస్ జీవితాలు కూడా మనకు కొత్త కాదు. హారర్-కామెడీ కథలు అసలే కొత్త కాదు. ఉన్నంతలో కొత్తదనం ఉన్న పాయింట్ ఏదైనా ఉందంటే, అది డైలీ సీరియల్ కు ముడిపెడుతూ నిజజీవిత వ్యక్తులను హారర్ యాంగిల్ లో చూపించడమే. చచ్చినా చూడాల్సిందే అనే క్యాప్షన్ ఈ సినిమాకు ఎంత బాగా కుదిరిందంటే, ఈ విషయాన్ని ఇక్కడ చెప్పేకంటే తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.

సినిమాలో హారర్ ఎలిమెంట్స్ ఎక్కువగా భయపెట్టవు. ఎందుకంటే, అంతకుమించి హారర్ ను చూశారు ప్రేక్షకులు. అదే విధంగా సినిమాలో కామెడీ కూడా ఎక్కువగా నవ్వించదు. ఎందుకంటే, అంతకుమించి పొట్ట చెక్కలయ్యే కామెడీ సన్నివేశాలు ఇదివరకే చూసి ఉన్నారు. ఎటొచ్చి కథలో కామెడీని కాస్త మిక్స్ చేసి, పైపైన హారర్ మేకప్ వేసి, కొత్త ముఖాలతో ఫ్రెష్ గా చెప్పడం వల్ల ఈ సినిమాకు శుభాశీస్సులు దక్కుతాయి.

పూర్తిగా నటీనటుల పెర్ఫార్మెన్సు మీద ఆధారపడి తీసిన ఈ సినిమాలో కేబుల్ టీవీ శీనుగా హర్షిత్, అతడి ఇద్దరి స్నేహితులుగా గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి బాగా చేశారు. ఒకరు యాక్షన్ కోసం, ఒకరు కామెడీ కోసం అని గిరిగీసుకోకుండా కథలు, సన్నివేశాలకు తగ్గట్టు ముగ్గుర్ని చక్కగా వాడుకున్నాడు దర్శకుడు. ఈ ముగ్గురితో పాటు నటించిన శ్రియ, శ్రావణి, షాలినీ బాగా చేశారు. మరీ ముఖ్యంగా శ్రీవల్లిగా శ్రావణి చాలా బాగా చేసింది. సినిమాలో కీలకమైన ఈ పాత్రను ఆమె పోషించిన విధానం ఆకట్టుకుంటుంది. శ్రావణి, షాలినీ కూడా తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. డిష్ కుమార్ గా వంశీధర్ గౌడ్, మాయ పాత్రలో సమంత, డిష్ కుమార్ తల్లిగా గంగవ్వ ఆకట్టుకున్నారు. చిన్నచిన్న పదాలకు కూడా పిచ్చిపిచ్చి అర్థాలు చెప్పే పాత్రలో సమంత ఫన్నీగా నటించింది.

టెక్నికల్ గా సినిమాలో మెరుపుల్లేవ్. మ్యూజిక్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ అన్నీ కథకు తగ్గట్టు ఉన్నాయి. కథను క్రిస్ప్ గా 2 గంటల్లో కట్ చేసిన ఎడిటర్ ను ప్రత్యేకంగా మెచ్చుకోవాల్సిందే.

ప్రవీణ్ కండ్రేగుల మరోసారి తన మార్క్ కథ రాసుకొని, అక్కడక్కడ తన దర్శకత్వ ప్రతిభ చూపించాడు. సినిమా బండ్లిని అతడు వాడుకున్న విధానం బాగుంది కానీ, అదే టైమ్ లో కాస్త ఆసక్తిని కూడా తగ్గించింది. మ్యూజిక్ అర్థవంతంగా ఉంది. తొలిసారి సమంత నిర్మాతగా మారి తీసిన ఈ సినిమాలో ప్రొడక్షన్ వాల్యూస్ రిచ్ గా ఉన్నాయని చెప్పలేం. కథకు తగ్గట్టుగా మాత్రమే ఉన్నాయి. అయితే నిర్మాతగా తన తొలి సినిమాకు ఇలాంటి కథను ఎంచుకున్న సమంతకు ప్రత్యేక అభినందనలు.

ఓవరాల్ గా శుభం సినిమా కొంచెం మిడిల్ క్లాస్ ఎమోషన్స్, ఇంకొంచెం హారర్ ఎలిమెంట్స్, మరికొంచెం కామెడీతో ఓ ఫీల్ గుడ్ అనుభూతినిస్తుంది. హారర్ చూసి గజగజ వణికిపోతాం, కామెడీ సన్నివేశాలకు పగలబడి నవ్విపోతాం లాంటి అంచనాలు పెట్టుకోకుండా వెళ్తే, 2 గంటల పాటు సినిమాను ఎంజాయ్ చేయొచ్చు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com